


PRGI NO: TGTEL/25/A5314

# అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : లింగం రాజయ్య

బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్

WANTED REPORTERS
అర్జున్ సమాచారం
తెలుగు దినపత్రిక
జర్నలిజంపై ఆసక్తి ఉన్న వారికి
సువర్ణావకాశం!
కావలసిన వారు:
జిల్లా బ్యూరో ప్రతినిధులు
నియోజకవర్గ ఇంచార్జులు
మునిసిపల్ రిపోర్టర్లు
మండల రిపోర్టర్లు
రాయగల ప్రతిభ, నిజాయితీ, సమాజంపై అవగాహన ఉన్న వారికి స్వాగతం.
మీ ప్రాంతంలో జరిగే తాజా వార్తలను మాకు అందించండి.
"నిజాయితీగా రాయండి... సమాజానికి చెప్పండి..."
"మా కలం మీది... సమాజం కోసం!"
సంప్రదించండి: 8121319896
ప్రతి వార్త... ప్రజల కోసం!

నల్లగొండ | హైదరాబాద్ | రంగారెడ్డి | epaper.arjun saamaacharam.com | శుక్రవారం 10, జులై 2026 | సంపుటి :1 సంచిక : 188 | పేజీలు : 8 , వెల.2.00



## గగన్‌యాన్ యాత్రకు ఆస్ట్రేలియా ఊతం..

భారతదేశపు మొట్టమొదటి మానవసహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్'కు అంతర్జాతీయంగా భారీ మద్దతు లభించింది. ఈ ప్రతిష్ఠాత్మక మిషన్‌కు మద్దతుగా ఆస్ట్రేలియాకు చెందిన కోకోస్ (కీలింగ్) దీవులలో తాత్కాలిక స్పేస్ ట్రాకింగ్ టెర్మినల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ ప్రకటించారు.

2



### ఢిల్లీలో భారీ జాబ్ స్కాం..

## లక్షల్లో దోచుకున్న కేటుగాళ్లు

ఢిల్లీలో నిరుద్యోగులను విచిత్రమైన తీరులో కేటుగాళ్లు మోసం చేశారు. ఇన్‌కమ్ టాక్స్ శాఖలో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు ఈ ముఠా లక్షల్లో టోకరా వేసింది. ఈ భారీ జాబ్ స్కాం రాకెట్‌ను ఢిల్లీ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. నిందితుల్లో ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన మాజీ ఉద్యోగి చిరాగ్ అగర్వాల్ కూడా ఉన్నారు.

2



### ముగిసిన గడువు.. వాట్సాప్‌నకు

## మరో ఛాన్స్ లేదు: కేంద్ర ప్రభుత్వం

వాట్సాప్ 'యూజర్‌నేమ్' నోటీసుల గడువు ఈరోజు(గురువారం)తో ముగిసిందని కేంద్ర ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్ వెల్లడించారు. గడువు పొడిగించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ నోటీసులపై వాట్సాప్ (మెటా) యాజమాన్యం నేడు సమాధానం ఇవ్వనుంది. కేంద్రం అనుమతి ఇచ్చే వరకు భారత్‌లో 'యూజర్‌నేమ్' ఫీచర్‌ను తీసుకురాబోమని వాట్సాప్ స్పష్టం చేసింది. వాట్సాప్‌తో పాటు టెలిగ్రామ్, సిగ్నల్ యాప్‌లకు కూడా కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ నోటీసులు పంపించింది. వాట్సాప్‌లో ఫోన్ నంబర్ లేకుండా చాట్ చేసుకునే 'యూజర్‌నేమ్' ఫీచర్‌పై కేంద్ర ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.

2




# 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం

- ప్రపంచంలో బెస్ట్ లివింగ్ సిటీగా హైదరాబాద్
- భాగ్యనగరాన్ని కూడా కాలుష్య సమస్య వేధిస్తోంది
- మూసీని ప్రక్షాళన చేయాలని నిర్ణయించాం
- కోర్ అర్బన్ ఏరియాను అభివృద్ధి చేయడానికి ప్రత్యేక పాలసీ
- పరిశ్రమలను ఔటర్ అవతలకు తరలించబోతున్నాం
- ఓఆర్ఆర్ అవతల పరిశ్రమలకు భూములు
- దేశ జీడీపీలో 10శాతం వాటా తెలంగాణ నుంచే
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

వార్త 2లో

తెలంగాణలో బెస్ట్ ఇండస్ట్రియల్ పాలసీ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు(గురువారం)జిల్లా పర్యటనలో భాగంగా సీతారాం పూర్ ప్రీమియర్ ఎనర్జీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారతదేశ అత్యాధునికి నెక్స్ట్ జెన్ సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్‌ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. ప్రపంచంలో బెస్ట్ లివింగ్ సిటీగా హైదరాబాద్ ఉందన్నారు. భాగ్యనగరాన్ని కూడా కాలుష్య సమస్య వేధిస్తోందని చెప్పారు. మూసీని ప్రక్షాళన చేయాలని నిర్ణయించామన్నారు. కోర్ అర్బన్ ఏరియాను అభివృద్ధి చేయడానికి ప్రత్యేక పాలసీ రూపొందించనున్నట్లు వెల్లడించారు.

### మెల్‌బోర్న్‌లో మోదీకి ఘన

## స్వాగతం.. మార్వెల్ స్టేడియం 'హౌస్‌ఫుల్'



2

ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీకి మెల్‌బోర్న్ మార్వెల్ స్టేడియంలో ప్రవాస భారతీయులు ఘన స్వాగతం పలికారు. 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమానికి 30 వేల మందికిపైగా ఎన్‌ఆర్‌ఐలు హాజరయ్యారు. దీంతో ఒక్కసారిగా స్టేడియమంతా కిక్కిరిసింది. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్.. మోదీని ప్రత్యేకంగా ఆహ్వానించారు.ప్రధాని మోదీ ప్రసంగిస్తూ.. తనకు లభించిన ఆత్మీయ ఆతిథ్యం పట్ల ఆస్ట్రేలియా ప్రజలు, ప్రధాని ఆల్బనీస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

2



## పోక్సో కేసులో బండి భగీరథ్‌కు హైకోర్టు బెయిల్

### కేసీఆర్‌కు నమ్మకం లేకనే

## హరీశ్‌రావును ఆ పదవి నుంచి తొలగించారు: మంత్రి ఉత్తమ్



2

మాజీ మంత్రి హరీశ్‌రావుకి ( మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఇరిగేషన్‌లో హరీశ్‌రావు నిష్ణాతుడైతే వాళ్ల మామ కేసీఆర్ ఆయనను మంత్రి పదవి నుంచి మొదట్లో ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. ఈరోజు (గురువారం) సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్ చిట్‌చాట్ చేశారు. పదవి నుంచి తీసేశారని విమర్శించారు.



2

## కేసీఆర్ హయాంలో క్రాప్ డ్యామేజ్‌కి ఒక్క రూపాయి ఇవ్వలేదు: భట్టి విక్రమార్క



2

## సింగరేణి బకాయిలపై అసెంబ్లీలో ప్రశ్నిస్తాం: ఎమ్మెల్యే పాయల్ శంకర్

# గగన్‌యాన్ యాత్రకు ఆస్ట్రేలియా ఊతం..

## కోకోస్ దీవుల్లో తాత్కాలిక స్పేస్ ట్రాకింగ్ టెర్మినల్

మెల్‌బోర్న్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

భారతదేశపు మొట్టమొదటి మానవసహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్'కు అంతర్జాతీయంగా భారీ మద్దతు లభించింది. ఈ ప్రతిష్ఠాత్మక మిషన్‌కు మద్దతుగా ఆస్ట్రేలియాకు చెందిన కోకోస్ (కీలింగ్) దీవులలో తాత్కాలిక స్పేస్ ట్రాకింగ్ టెర్మినల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ ప్రకటించారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా నిన్న ఆస్ట్రేలియా చేరుకున్న భారత ప్రధాని నరేంద్ర మోదీతో మెల్‌బోర్న్‌లో జరిపిన సంయుక్త మీడియా సమావేశంలో అల్బనీస్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఇరు దేశాల మధ్య పెరుగుతున్న వ్యూహాత్మక, సాంకేతిక బంధానికి ఈ నిర్ణయం అద్దం పడుతోంది.

# 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం

ప్రపంచంలో బెస్ట్ లివింగ్ సిటీగా హైదరాబాద్

భాగ్యనగరాన్ని కూడా కాలుష్య సమస్య వేధిస్తోంది

మూసీని ప్రక్షాళన చేయాలని నిర్ణయించాం

కోర్ అర్బన్ ఏరియాను అభివృద్ధి చేయడానికి ప్రత్యేక పాలసీ

పరిశ్రమలను ఔటర్ అవతలకు తరలించబోతున్నాం

ఓఆర్ఆర్ అవతల పరిశ్రమలకు భూములు

దేశ జీడీపీలో 10శాతం వాటా



తెలంగాణ నుంచే

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

రంగారెడ్డి, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

తెలంగాణలో బెస్ట్ ఇండస్ట్రియల్ పాలసీ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు(గురువారం)జిల్లా పర్యటనలో భాగంగా సీతారాంపూర్ ప్రీమి యర్ ఎనర్జీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారతదేశ అత్యాధునికి నెక్స్ట్ జెన్ సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్‌ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. ప్రపంచంలో బెస్ట్ లివింగ్ సిటీగా హైదరాబాద్ ఉందన్నారు. భాగ్యనగరాన్ని కూడా కాలుష్య సమస్య వేధిస్తోందని చెప్పారు. మూసీని ప్రక్షాళన చేయాలని నిర్ణయించామన్నారు. కోర్ అర్బన్ ఏరియాను అభివృద్ధి చేయడానికి ప్రత్యేక పాలసీ రూపొందించనున్నట్లు వెల్లడించారు. పరిశ్రమలను ఔటర్ అవతలకు తరలించబోతున్నామని సీఎం తెలిపారు. ఓఆర్ఆర్ అవతల పరిశ్రమలకు భూములు కేటాయిస్తామన్నారు. మధ్య పారిశ్రామికవాడలు ఏర్పాటు కానున్నాయన్నారు. అవతల అగ్రి ఎకానమీ డెవలప్ చేస్తున్నామని చెప్పారు. 2034 నాటికి 1 ట్రిలియన్ ఎకానమీ లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. దేశ జీడీపీలో 10శాతం వాటా తెలంగాణ నుంచే ఉండాలన్నారు. బ్లూకాలర్ ఎంప్లాయిస్‌లో కొత్త స్కిల్స్ పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. యువతలో నైపుణ్యాభివృద్ధి కోసమే స్కిల్ వర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# ఢిల్లీలో భారీ జాబ్ స్కాం.. లక్షల్లో దోచుకున్న కేటుగాళ్లు

ఢిల్లీ, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

ఢిల్లీలో నిరుద్యోగులను విచిత్రమైన తీరులో కేటుగాళ్లు మోసం చేశారు. ఇన్‌కమ్ టాక్స్ శాఖలో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు ఈ ముఠా లక్షల్లో టోకరా వేసింది. ఈ భారీ జాబ్ స్కాం రాకెట్‌ను ఢిల్లీ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. నిందితుల్లో ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన మాజీ ఉద్యోగి చిరాగ్ అగర్వాల్ కూడా ఉన్నారు. ఐటీ ఆఫీస్ లోపలే నకిలీ ఇంటర్వ్యూలు నిర్వహించి కేటుగాళ్లు బాధితులను నమ్మించారు. ఏకంగా కార్యాలయం ప్రాంగణంలోనే నకిలీ ఇంటర్వ్యూలు, ఓరియంటేషన్ క్లాసులు నిర్వహించడం గమనార్హం. ఢిల్లీ సివిక్ సెంటర్‌లోని ఇన్‌కమ్ టాక్స్ కార్యాలయాన్ని వేదికగా చేసుకుని ఈ నకిలీ నియామకాల పర్వం కొనసాగింది. సోషల్ మీడియాలో నకిలీ ప్రకటనల ద్వారా నిరుద్యోగ యువతను ఈ ముఠా ఆకర్షించింది. ఒక్కొక్కరి నుంచి రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేసినట్లు ఢిల్లీ పోలీసులు గుర్తించారు. గతంలో 15 ఏళ్ల పాటు ఐటీ శాఖలోనే పనిచేసిన అనుభవంతో బాధితులను ఆఫీస్ లోపలికి నిందితుడు చిరాగ్ తీసుకెళ్లాడు. నకిలీ వెరిఫికేషన్ ఫాంలు, సర్వీస్ బుక్‌లు చూపించి ఈ ముఠా సభ్యులు నమ్మించారు. అజ్మేరి గేట్ బాధితుడి ఫిర్యాదుతో టెక్నికల్ సర్వైలెన్స్ ద్వారా నిందితులను పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి నాలుగు మొబైల్ ఫోన్లు, బాధితుల నకిలీ పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి కోసం ఢిల్లీ పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

# ముగిసిన గడువు.. వాట్సాప్‌నకు మరో ఛాన్స్ లేదు: కేంద్ర ప్రభుత్వం

ఢిల్లీ, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

వాట్సాప్ 'యూజర్‌నేమ్' నోటీసుల గడువు ఈరోజు(గురువారం)తో ముగిసిందని కేంద్ర ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్ వెల్లడించారు. గడువు పొడిగించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ నోటీసులపై వాట్సాప్ (మెటా) యాజమాన్యం నేడు సమాధానం ఇవ్వనుంది. కేంద్రం అనుమతి ఇచ్చే వరకు భారత్‌లో 'యూజర్‌నేమ్' ఫీచర్‌ను తీసుకురాబోమని వాట్సాప్ స్పష్టం చేసింది. వాట్సాప్‌తో పాటు టెలిగ్రామ్, సిగ్నల్ యాప్‌లకు కూడా కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ నోటీసులు పంపించింది. వాట్సాప్‌లో ఫోన్ నంబర్ లేకుండా చాట్ చేసుకునే 'యూజర్‌నేమ్' ఫీచర్‌పై కేంద్రప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ కొత్త ఫీచర్ వల్ల దేశంలో సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు విపరీతంగా పెరిగే ముప్పు ఉందని ఐటీ శాఖ హెచ్చరించింది. వినియోగదారుల ఫోన్ నంబర్లు దాచిపెడితే నేరస్థులను ట్రాక్ చేయడం కష్టమవుతుందని కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. తమ ప్రభుత్వానికి పూర్తి సంతృప్తి కలిగే వరకు ఈ ఫీచర్‌ను లాంచ్ చేయొద్దని మెటా సంస్థకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే యూజర్‌నేమ్ ఫీచర్ వాడుతున్న టెలిగ్రామ్, సిగ్నల్ యాప్‌లకూ నోటీసులు జారీ చేసింది. టెలిగ్రామ్, సిగ్నల్ యాప్‌ల వివరణ కోసం మరికొంత సమయం కేటాయించినట్లు ఐటీ కార్యదర్శి ఎస్. కృష్ణన్ తెలిపారు. సైబర్ మోసాల అదుపునకు తాము మల్టీ-లేయర్ డిఫెన్స్ సిస్టమ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వాట్సాప్ ప్రతినిధి తెలిపారు. ప్రముఖులు, ప్రభుత్వ ఖాతాల పేర్లను ఇతరులు వాడకుండా ముందే రిజర్వ్ చేస్తామని వాట్సాప్ వివరించింది. దేశంలో వాట్సాప్‌నకు రూ.50 కోట్లకు పైగా యూజర్లు ఉన్నందున భద్రతపై రాజీ పడేది లేదని కేంద్రం స్పష్టం చేసింది. ఇన్‌స్టాగ్రామ్ ప్రకటనలు, టెలిగ్రామ్ పైరసీ వ్యవహారాలపై కూడా కేంద్రం ఇటీవలే నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే.

# పోక్సో కేసులో బండి భగీరథ్‌కు హైకోర్టు బెయిల్




హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్‌కు తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ. లక్ష పూచీకత్తుతో పాటు కోర్టు నిర్దేశించిన షరతుల మేరకు బెయిల్ మంజూరైంది. ఈ కేసు విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది.

# కేసీఆర్ హయాంలో క్రాప్ డ్యామేజ్‌కి ఒక్క రూపాయి ఇవ్వలేదు: భట్టి విక్రమార్క

ఖమ్మం జిల్లా, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క (దీష్ట్రఖీఅ ఎఱఅఎతీఝఝతీఝ) వ్యాఖ్యానించారు. రైతాంగానికి అవసరమైన సహాయ సహకారాలు అన్ని విధాలుగా అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈరోజు (గురువారం) ఖమ్మం జిల్లా చింతకాని మండలం లచ్చగూడెంలో డిప్యూటీ సీఎం పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. చింతకాని మండలం జగన్నాధపురం మత్కేపల్లి క్రాస్ రోడ్డులో రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతు ఆశీర్వాద సభకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేబినెట్ మంత్రులు అందరినీ ఆహ్వానించామని పేర్కొన్నారు. పదేళ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ రైతు భరోసాకు రూ.75 వేల కోట్లు ఖర్చు చేసిందని మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాకు కేవలం రెండున్నరేళ్లలో రూ.35 వేల కోట్లను రైతులకు అందజేసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో క్రాప్ డ్యామేజ్‌కి ఒక్క రూపాయి కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో రైతుల కోసం పని చేస్తోందని స్పష్టం చేశారు. రైతుభరోసా కింద కేవలం తొమ్మిది రోజుల్లో ఎనిమిది ఎకరాల చొప్పున పూర్తిస్థాయిలో అందరికీ రూ.8759 కోట్లు ఇచ్చామని వెల్లడించారు. రైతు ఆశీర్వాద సభలో మరో రూ.1900 కోట్లు రైతు భరోసాకు తొమ్మిది ఎకరాల నుంచి యాభై ఎకరాల వరకూ విడుదల చేయనున్నామని తెలిపారు. అన్నదాతలు రైతు ఆశీర్వాద సభకు పెద్ద సంఖ్యలో తరలి రావాలని మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

# మెల్‌బోర్న్‌లో మోదీకి ఘన స్వాగతం.. మార్వెల్ స్టేడియం 'హౌస్‌ఫుల్'

ఇంటర్నెట్ డెస్క్:

ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీకి మెల్‌బోర్న్ మార్వెల్ స్టేడియంలో ప్రవాస భారతీయులు ఘన స్వాగతం పలికారు. 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమానికి 30 వేల మందికిపైగా ఎన్‌ఆర్‌ఐలు హాజరయ్యారు. దీంతో ఒక్కసారిగా స్టేడియమంతా కిక్కిరిసింది. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్.. మోదీని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ప్రధాని మోదీ ప్రసంగిస్తూ.. తనకు లభించిన ఆత్మీయ ఆతిథ్యం పట్ల ఆస్ట్రేలియా ప్రజలు, ప్రధాని ఆల్బనీస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సిడ్నీలో గతంలో రెండుసార్లు ప్రవాస భారతీయులను కలిసిన విషయాన్ని ఈ సందర్భంగా స్మరించుకున్నారు మోదీ. అహ్మదాబాద్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం ఉంటే, మెల్‌బోర్న్‌లో ఐకానిక్ స్టేడియం ఉందని పేర్కొన్నారు.



అయితే.. నేడు మార్వెల్ స్టేడియంలో అభిమానుల సందడి నెలకొనడంతో 'ఈ షో హౌస్‌ఫుల్.. బ్లాక్‌బస్టర్' అని మోదీ వ్యాఖ్యానించగా.. అక్కడివారు ఒక్కసారిగా హర్షధ్వానాలతో హోరెత్తించారు. 'భారత్-ఆస్ట్రేలియా సంబంధాలు మునుపెన్నడూ లేనంత బలంగా ఉన్నాయి. ఈ బంధాన్ని మరింత దృఢంగా తీర్చిదిద్దడంలో ఎన్‌ఆర్‌ఐల పాత్ర కీలకం. మెల్‌బోర్న్‌లోని అనేక ప్రాంతాలు ఇప్పుడు 'మినీ ఇండియా'గా గుర్తింపు పొందుతున్నాయి' అని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీని విజనరీ నాయకుడిగా అభివర్ణించారు. ప్రపంచ దేశాలకు ఆయన స్ఫూర్తిగా నిలుస్తున్నారన్న అల్బనీస్.. మోదీ తమకు ఆప్తమిత్రుడని కొనియాడారు. ఆయన నాయకత్వంలో భారత్ ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న శక్తిమంతమైన ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని ప్రశంసించారు.

# కేసీఆర్‌కు నమ్మకం లేకనే హరీశ్‌రావును ఆ పదవి నుంచి తొలగించారు: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

మాజీ మంత్రి హరీశ్‌రావుకి ( మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఇరిగేషన్‌లో హరీశ్‌రావు నిష్ణాతుడైతే వాళ్ల మామ కేసీఆర్ ఆయనను మంత్రి పదవి నుంచి మొదట్లో ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. ఈరోజు (గురువారం) సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్ చిట్‌చాట్ చేశారు. హరీశ్‌రావుపై కేసీఆర్‌కు నమ్మకం లేకనే మంత్రి పదవి నుంచి తీసేశారని విమర్శించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో వచ్చే వేసవి వరకు రిపేర్‌లు పూర్తి అవుతాయని తెలిపారు. బ్యారేజీలో డ్యామేజీల మరమత్తులు చేయడానికి తాము చిత్తశుద్ధితో పని చేస్తున్నామని స్పష్టం చేశారు. హరీశ్‌రావు తనకు మంత్రి పదవి ఇవ్వండి అంటున్నారని.. కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి చెప్పినట్లుగా హరీశ్‌రావు తమ పార్టీలో చేరతారా? అని ప్రశ్నించారు. హరీశ్‌రావు వ్యాఖ్యలపై సరైన సమయంలో సవివరంగా సమాధానం చెబుతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# సింగరేణి బకాయిలపై అసెంబ్లీలో ప్రశ్నిస్తాం: ఎమ్మెల్యే పాయల్ శంకర్

న్యూఢిల్లీ:

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కౌంటర్ ఇచ్చారు. తాడిచర్ల-2 గని కేటాయింపు పూర్తిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కృషి ఫలితమేనని అన్నారు. యూపీఏ-2 ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ తాడిచర్ల-2 బొగ్గు గనిని సింగరేణికి కేటాయించలేకపోయిందని విమర్శించారు. సింగరేణికి మీరేం చేశారని భట్టి విక్రమార్కను ప్రశ్నించారు. తెలంగాణ బిడ్డగా, సింగరేణి కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రధాని నరేంద్ర మోదీని ఒప్పించి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ గనిని సింగరేణికి కేటాయింపునకు కృషి చేశారని పేర్కొన్నారు. తాడిచర్ల గని కేటాయింపును సింగరేణి కార్మిక సంఘాలు స్వాగతిస్తూ ప్రధాని మోదీ, కిషన్ రెడ్డికి పాలాభిషేకాలు చేస్తున్నాయని తెలిపారు. కార్మికుల్లో వ్యక్తమవుతున్న ఆనందాన్ని, బీజేపీకి వస్తున్న ప్రజాదరణను కాంగ్రెస్ సహించకలేకపోతోందన్నారు. సింగరేణి ఆర్థిక పరిస్థితిపై కూడా పాయల శంకర్ తీవ్ర విమర్శలు చేశారు. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిపై రూ.32 వేల కోట్ల బకాయిలు మోపిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరో రూ.22 వేల కోట్ల బకాయిలు పెట్టిందని అన్నారు. మొత్తం రూ.55 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ పరిస్థితికి బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమని వ్యాఖ్యానించారు. సింగరేణి కార్మికులు ఈ రెండు పార్టీల నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయిలను ఎప్పుడు, ఎలా చెల్లిస్తుందో స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతామని తెలిపారు. సింగరేణిలో కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉందని, సంస్థ వ్యవహారాల్లో కేంద్రం మరింత చురుకుగా వ్యవహరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తన 51 శాతం వాటా పేరుతో సింగరేణి నిధులను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. బంగారు గనిలాంటి సింగరేణిని చీకట్లోకి నెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాసి కేంద్రం పూర్తి స్థాయిలో జోక్యం చేసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. అదే సమయంలో దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తోందని, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం అన్ని విధాలా సహకరిస్తోందని పాయల్ శంకర్ పేర్కొన్నారు.

# ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధిలో ముందడుగు

## రూ.12 కోట్లతో నాగర్‌కర్నూల్ నూతన బస్ స్టేషన్‌కు శంకుస్థాపన

### నాగర్‌కర్నూల్-వనపర్తి మధ్య ఆర్టీసీ సర్వీసుల ప్రారంభం

### ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల బాటలోకి తీసుకొచ్చాం

### మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

**నాగర్‌కర్నూల్,**

రాష్ట్రం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల డైట్, కాస్మెటిక్ ఛార్జీలను పెంచి వారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో రూ.12 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన ఆర్టీసీ బస్ స్టేషన్‌కు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మరో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం నాగర్‌కర్నూల్ నుంచి వనపర్తి వరకు కొత్తగా ప్రారంభించిన ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభించి, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని కూడా మంత్రులు ప్రారంభించారు. అనంతరం ఉయ్యాలవాడ బీసీ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించి, అక్కడి వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, టీజీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలకు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషకరమని తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహాలక్ష్మి పథకం అమలుతో ఇప్పటివరకు 320 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో



ఉచితంగా ప్రయాణించి, సుమారు రూ.11,371 కోట్ల మేర ప్రయాణ ఖర్చును ఆదా చేసుకున్నారని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికులు 55 రోజులపాటు సమ్మె చేయాల్సిన పరిస్థితులు ఏర్పడి, పలువురు ఆత్మహత్యలకు పాల్పడిన దురదృష్టకర పరిస్థితులను రాష్ట్రం చూసిందన్నారు. అయితే ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం కేవలం మూడు రోజుల్లో కార్మికుల సమస్యలను పరిష్కరించిందని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వం కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి, ప్రయాణికుల సౌకర్యం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో ముందుకు సాగుతోందన్నారు. గత పదేళ్లలో ఒక్క కొత్త బస్సును కూడా కొనుగోలు చేయలేదని, ఒక్క ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. ప్రజాపాలన ప్రభుత్వంలో ఆర్టీసీని ఆపరేషనల్ నష్టాల నుంచి లాభాల దిశగా తీసుకువచ్చామని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని అమలు చేయడంతో పాటు బాండ్లు, డీఏలు విడుదల చేశామని, కారుణ్య నియామకాలు చేపట్టి కొత్త ఉద్యోగాల భర్తీ ప్రారంభించామని చెప్పారు. కొత్త బస్సుల కొనుగోలు కూడా కొనసాగుతోందన్నారు. గతంలో విధుల నుంచి తొలగించబడిన ఉద్యోగులను తిరిగి సేవల్లోకి తీసుకున్నామని వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 10 వేల ఆర్టీసీ బస్సులు ప్రతిరోజూ సుమారు 30 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తూ 65 లక్షల మంది ప్రయాణికులకు సేవలందిస్తున్నాయని మంత్రి వివరించారు. హైదరాబాద్ నగరంలో కొత్తగా 375 రూట్లలో బస్సులు నడుపుతూ ప్రతిరోజూ అదనంగా 7 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందిస్తున్నామని, అవసరమున్న ప్రాంతాల్లో మరిన్ని సర్వీసులు ప్రారంభిస్తామని తెలిపారు. ప్రభుత్వం ప్రతి అర్హ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తోందని, గతంలో రేషన్ కార్డుల కోసం ప్రజలు చెప్పులు అరిగేలా తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు కొత్త రేషన్ కార్డులు జారీ చేసి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మహిళలకు చీరల పంపిణీ, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందించడం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా వారిని సాధికారత దిశగా నడిపిస్తున్నామని పేర్కొన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో ప్రజల ఆకాంక్షల కోసం రాజీనామా చేసి పోరాటం చేసిన రోజుల్ని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ÷రిలిడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు ట్రాఫిక్, రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని మంత్రులు పిలుపునిచ్చారు. రవాణా శాఖ, పోలీసు శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

# యూరియా లభ్యతను మరింత సరళతరం

### మీసేవ కేంద్రాల ద్వారా యూరియా బుకింగ్

### యాప్ లో బుకింగ్ చేసుకోలేనివారికి సులువైన మార్గం

**హైదరాబాద్**

రాష్ట్రంలోని రైతులకు సబ్సిడీ యూరియా అందుబాటును మరింత సులభతరం చేయటం కోసం ప్రభుత్వం వినూత్న నిర్ణయం తీసుకుంది. పారదర్శకతను పెంపొందిస్తూ, సకాలంలో యూరియా పంపిణీ చేయటం కోసం రాష్ట్ర వ్యవసాయశాఖ యూరియా బుకింగ్ సేవను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మీసేవ కేంద్రాల ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోలేని రైతులు తమ సమీపంలోని మీ సేవ కేంద్రాన్ని



సందర్శించి, ఆపరేటర్ సహాయంతో యూరియా బుకింగ్ చేసుకోవచ్చు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల. శ్రీధర్ బాబు నేతృత్వంలో పనిచేస్తున్న మీసేవ, వ్యవసాయశాఖతో కలిసి ఈ కొత్త చొరవను ప్రారంభిస్తుంది. రైతు తన పట్టాదారు పాస్‌బుక్ నంబర్‌తో సమీపంలోని మీ సేవ కేంద్రాన్ని సందర్శించాలి. మీ సేవ ఆపరేటర్ రైతు వివరాలను సేకరించి, సాగు విస్తీర్ణం మరియు పంట వివరాలను నమోదు చేస్తారు. రైతు ఎంపిక చేసిన ఎరువుల డీలర్ వద్ద అవసరమైన యూరియా పరిమాణాన్ని బుక్ చేస్తారు. రైతు నమోదిత మొబైల్ నంబర్‌కు పంపిన ఓటిపిని ధృవీకరించిన తర్వాత వెంటనే బుకింగ్ ఐడి జారీ చేయబడుతుంది. మీ సేవ ద్వారా పొందిన బుకింగ్ ఐడి బుకింగ్ చేసిన తేదీని మినహాయించి 48 గంటలపాటు మాత్రమే చెల్లుబాటు అవుతుంది. బుకింగ్ గడువు ముగిసేలోపు రైతులు ఎంపిక చేసిన ఎరువుల డీలర్‌ను సంప్రదించి యూరియాను కొనుగోలు చేయాలి. సబ్సిడీ యూరియా బుకింగ్‌ను అధికారిక ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ లేదా మీ సేవ కేంద్రాల ద్వారానే చేయాలని వ్యవసాయశాఖ సూచిస్తోంది. ఓటిపి అందుకోవడానికి రైతులు తమ పట్టాదారు పాస్ బుక్ తో అనుసంధానమైన మొబైల్ నంబర్ యాక్టివ్‌లో ఉండేలా చూసుకోవాలి. కేవలం పదిరూపాయల నామమాత్రపు సేవా రుసుముతో మీసేవ ద్వారా రైతులు అందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. ఏవైనా సందేహాలు లేదా సహాయం కోసం సమీప వ్యవసాయ విస్తరణ అధికారి, మండల వ్యవసాయ అధికారి లేదా సమీప మీసేవ కేంద్రాన్ని సంప్రదించవచ్చు. ఈ సౌకర్యాన్ని రాష్ట్రంలోని రైతులందరూ వినియోగించుకొని, సబ్సిడీ యూరియాను అధికారిక బుకింగ్ విధానం ద్వారా పొందాలని వ్యవసాయశాఖ విజ్ఞప్తి చేస్తోంది.

# ఎన్నికలు ఎప్పుడైనా వార్ వన్ సైడే

### ఇప్పటికే బిఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పారు

### పేదల సొంతింటి కలను ప్రజా ప్రభుత్వం సాకారం చేస్తోంది

### జూరాల, నెట్టంపాడు ముంపు భూనిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్లు

### జోగులాంబ జిల్లాలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**జోగులాంబ గద్వాల**

÷ాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికల వచ్చినా వార్ వన్ సైడేనని మళ్ళీ అధికారంలోకి వచ్చేది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వమేనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో జరిగిన అన్నిఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పడంతో పాటు, ప్రజా ప్రభుత్వానికి ప్రజల దీవెనలు అందించారన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం ర్యాలంపాడు గ్రామంలో జరిగిన సామూహిక ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు మరియు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో సహచర మంత్రి వాకిటి శ్రీహరి , ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు చేసుకున్న లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలిపి వారికి ఆత్మీయ చిరు కానుకలను అందించడం జరిగింది. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల రెండవ విడత మంజూరు పత్రాలను లబ్దిదారులకు పంపిణీ చేయడం జరిగింది. గద్వాల జిల్లా ప్రజలు చూపించిన అభిమానం మరువలేనిదన్నారు. పేదల ఆత్మ గౌరవానికి చిహ్నం ఇందిరమ్మ ఇండ్లు. దశాబ్దాల పేదల సొంతింటి కలను ప్రజా ప్రభుత్వంలో సాకారం చేస్తోంది. కుల, మత, రాజకీయాలకతీతంగా పేదలైతే అయితే చాలు ఇందిరమ్మ ఇల్లు కట్టించాలని ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. జూరాల, నెట్టంపాడు ముంపు భూ నిర్వాసితులకు కూడ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం. రెవెన్యూ శాఖ పరిధిలోని గద్వాల జిల్లా కావాల్సిన ఆర్డీవో, ఎమ్మార్వో కార్యాలయాలను కూడా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మాది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం. పేదల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడే ప్రజాప్రభుత్వం అని మంత్రి తెలిపారు.

# మహారాష్ట్ర వర్షాలతో గోదావరికి వరద

పోలవరం వద్ద ఉధృతికి కొట్టుకు పోయిన పైపులు

**పోలవరం,**

ఏపీ జీవనాడి పోలవరం ప్రాజెక్టు దగ్గర గోదావరి ఉధృతి పెరుగుతోంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు పోలవరం ప్రాజెక్టు దగ్గర గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఈ క్రమంలో బుధవారం పోలవరం ప్రాజెక్టు పైపులు కొట్టుకుపోయాయి. పెరిగిన గోదావరి ఉధృతి కారణంగా పోలవరం ప్రాజెక్ట్ స్పిల్ వేలో ఉన్న మొత్తం 48 గేట్లను ఎత్తివేసి నీటిని దిగువకు విడుదల చేశారు అధికారులు. ఈ క్రమంలో నీటి ప్రవాహం కోసం వేసిన భారీ ఐరన్ తూర, ఐరన్ పైపులు వరద ఉధృతికి కొట్టుకు పోయాయి. స్పిల్ ఛానల్ కింద పనుల రవాణా కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు కూడా పూర్తిగా కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న స్పిల్‌వే మీదుగా వెళ్లే రోడ్డు మార్గం గుండా రాకపోకలు కొనసాగుతున్నాయి. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో పోలవరం ప్రాజెక్టు దగ్గర గోదావరి వరద పోటెత్తుతోంది. ఈ క్రమంలో పోలవరం ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. మహారాష్ట్రతో పాటు ముంబై పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టు దగ్గర నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. ప్రస్తుతం పోలవరం స్పిల్వే దగ్గర నీటిమట్టం 26.69 మీటర్లకు చేరిందని తెలిపారు అధికారులు. ఎగువ కాపర్ డ్యామ్ దగ్గర నీటి మట్టం 26.80 మీటర్లుగా నమోదైందని తెలిపారు అధికారులు.

# ఎస్సీలను పావులుగా వాడుకుంటున్నారు

### రాజకీయ నేతల తీరుపై మండిపడ్డ మాధవ్

**విజయవాడ,**

రాష్ట్రంలో విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయని.. ఎస్సీలను పావులుగా వాడుకుని రాజకీయాలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వ్యాఖ్యానించారు. బుధవారం విజయవాడలో నిర్వహించిన బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎవరినైనా ఏది పడితే అది మాట్లాడొచ్చని అనుకుంటున్నారని.. హిందూ దేవతలను తిడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాట్లాడిన తర్వాత అరెస్టు చేస్తే హక్కుల ఉల్లంఘన అంటున్నారన్నారు. సినిమా తారలు, యూట్యూబర్స్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని.. వీరిపై ఎందుకు దేశద్రోహం కేసులు పెట్టకూడదని ప్రశ్నించారు. ఉపా చట్టం కింద కేసులు ఎందుకు పెట్టకూడదో చెప్పాలన్నారు. అధికారంలోకి వచ్చేందుకు ఎస్సీలను వాడుకుంటున్నారని ఆరోపించారు. విదేశీ శక్తులు కూడా కుట్రలో పాలు పంచుకుంటున్నాయన్నారు. విద్రోహ కార్యకలాపాలు చేసే వాళ్లు అందరూ ఇక్కడకు చేరుకుంటున్నారని తెలిపారు. హైకోర్టు తీర్పును ఉద్దేశించి పలువురు సభలు పెట్టి మాట్లాడుతున్నారని అన్నారు. ఏపీలో పెద్ద నాటకం జరుగుతోందని మాధవ్ అన్నారు. జోసెఫ్ తన పేరును రావణ్ అని మార్చుకున్నారని తెలిపారు. హిందువులపై విషం కక్కుతున్నారని వ్యాఖ్యానించారు. సంఘ విద్రోహ శక్తులను రాష్ట్రంలో తిరగనివ్వకూడదని మాధవ్ పేర్కొన్నారు.

# జడా శ్రవణ్ కుమార్‌పై ఐటీ శాఖకు ఫిర్యాదు

**విజయవాడ,**

జై భీమ్ భారత్ పార్టీ అధ్యక్షుడు జడా శ్రవణ్ కుమార్‌పై ఐటీ శాఖకు ఫిర్యాదు అందింది. జడా శ్రవణ్ కుమార్ ఆదాయపన్ను ఎగవేశారంటూ కారంపూడి జానకి సుమంత్ ఐటీ శాఖకు ఫిర్యాదు చేశారు. జడా శ్రవణ్ కుమార్‌పై బినామీ ఆస్తుల చట్టంతో పాటు ఆదాయపన్ను చట్టం కింద క్రిమినల్ చర్యలు చేపట్టాలని సుమంత్ తన ఫిర్యాదులో కోరారు. కాగా, మత విద్వేషాలు, వైషమ్యాలు రగిలిస్తూ, శాంతి భద్రతలకు భంగం కలిగించేలా రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని అందిన ఫిర్యాదు మేరకు కొద్దిరోజుల క్రితం జై భీమ్ భారత్‌పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడ శ్రవణ్‌కుమార్‌తోపాటు మరికొందరిపై ఏలూరు త్రీ టౌన్, కాళ్ల పోలీసు స్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయి. డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజును, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లను వ్యక్తిగతంగా దూషించి హేళన చేశారని ఏలూరు గొల్లాయిగూడానికి చెందిన పెద్దాడ వెంకటరమణ, కాళ్ల మండలం సీసలికి చెందిన తోట ఫణిబాబు ఫిర్యాదు చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు, పాలకోడేరు పోలీసు స్టేషన్లలోనూ శ్రవణ్ కుమార్‌పై ఫిర్యాదులందాయి.

# మహారాష్ట్రలో ఎడతెరిపిలేని వర్షాలు

**ముంబై,**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు మహారాష్ట్రను అతలాకుతలం చేస్తున్నాయి. పలు జిల్లాల్లో కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఇదే సమయంలో పుణెలో కూడా భారీ వర్షాల కారణంగా ఓ మూడంతస్తుల భవనం కుప్పకూలి తీవ్ర కలకలం రేపింది. మోషి ప్రాంతంలోని పింప్రి-చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్‌లోని మూడు అంతస్తుల కార్యాలయ భవనం ఒక్కసారిగా నేలమట్టమైంది. అధికారుల సమాచారం ప్రకారం, భవనం కూలిన సమయంలో అందులో ఉన్న 15 నుంచి 16 మంది కార్మికులు శిథిలాల కింద చిక్కుకుని ఉండే అవకాశం ఉంది.

# మతాల మధ్య చిచ్చు పెట్టే యత్నం

### హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు

### వారికి జగన్ వత్తాసు పలకడం మరీ దారుణం

### మండిపడ్డ మంత్రులు ఆనం, సత్యకుమార్ యాదవ్

**అమరావతి**

భారతీయులు, హిందువుల మనోభవాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేస్తున్న వారిని జగన్ సమర్థించడం, చిచ్చు పెట్టేలా చేయడం దారుణమని ఎపి మంత్రులు తీవ్రంగా మండిపడ్డారు. రాజకీయంగా ఉపయోగించుకునేందుకు ఇలాంటి నీచానికి దిగజారుతారా అని ప్రశ్నించారు. ఇలాంటి వారిని గొడ్డలి పార్టీ సమర్థించడం భారత రాజ్యాంగానికి తూట్లు పొడవడమేనని ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తూ రాజ్యాంగానికి పెడర్థాలు తీసి ప్రజల మనోభవాలను దెబ్బతీస్తున్నారని ధ్వజమెత్తారు. సమాజాన్ని తమవైపు తిప్పుకోవడానికి మత విద్వేషాలు రెచ్చగొడతారా అని మంత్రి ఆనం ప్రశ్నించారు. ఒక వ్యక్తి రావణ్ పేరుతో హిందువుల మనోభవాలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తూ పీఠాధిపతులను కూడా విమర్శించే స్థాయికి జగన్ అండ్ కో వెళ్లిపోయారని మండిపడ్డారు. ఇలాంటి వాటిని ప్రోత్సహించాలని రాజారెడ్డి రాజ్యాంగంలో రాసుకున్నారా? అని ప్రశ్నించారు. సామాన్యుల మనుగడను దెబ్బతీసే ప్రయత్నాన్ని ప్రోత్సహిస్తున్న జగన్ రెడ్డి వెంటనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్టికల్ 19(1ఏ) భావస్వేచ్ఛను ప్రతి ఒక్కరికీ కల్పించినట్లే... మత విశ్వాసాలను, స్వేచ్ఛను పరిరక్షించే హక్కులను రాజ్యాంగం కల్పించిందని మంత్రి ఆనం తెలిపారు. రాజ్యాంగం ఇవ్వని భావ ప్రకటన స్వేచ్ఛ తమకుందని చెప్పుకుంటూ అనేక వర్గాలను, మతాలను వేరు చేయాలని జోసఫ్ రావణ్ అనే వ్యక్తి ద్వారా జగనే చేయిస్తున్నారని ఆరోపించారు. మతాలను అగౌరవపరచమని ఏ రాజ్యాంగం చెప్పిందో జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వారిపై చట్టాలు తన పని తాను చేసుకోవాల్సి ఉందని మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. కులమత విద్వేషాలు పెంచేలా చేస్తున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ మండిపడ్డారు. రాజకీయంగా సానుకూల వాతావరణం ఉన్నప్పుడు లబ్ధి పొందాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయని విమర్శించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చట్ట పరిధిలో మత విద్వేషాలు రేకెత్తిస్తున్న వారిపై చర్యలు తప్పవన్నారు. పక్క రాష్ట్రాల నుంచి వీడియో మెసేజ్‌లు పంపుతూ విద్వేషాలు రేకిస్తున్నారని ఆరోపించారు. హిందుత్వ మూలాలు దెబ్బతీసేలా కుట్రపూరితంగా జగన్ మాట్లాడారంటూ విరుచుకుపడ్డారు. విద్వేషాలకు ఊతమిచ్చేలా నటుడు ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. జగన్ హయాంలో మూడు ప్రాంతాలనూ అభివృద్ధి చేయలేదని మంత్రి విమర్శించారు. మావిగన్ అనే అసంబద్ధమైన వాదన తీసుకొచ్చారన్నారు. పొంతన లేకుండా మాట్లాడుతున్న మాటలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. స్థానిక ఎన్నికల కోసం ప్రత్యేక ఆలోచనలు జరుగుతున్నాయని.. స్థానిక ఎన్నికల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధిపై ముందుకెళతామని చెప్పారు. త్వరలోనే స్థానిక ఎన్నికల్లో ఎవరు.. ఎక్కడ పోటీ చేయాలనే దానిపై పార్టీ అధినాయకత్వాలు నిర్ణయిస్తాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

# తప్పడు కూతలు కూసే వారికి ప్రజలే బుద్ధి చెప్పాలి

**అమరావతి**

జోసెఫ్ రావణ్ వ్యవహారంపై మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. జోసెఫ్ రావణ్, సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌కు మద్దతు ఎవరిస్తున్నారని ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. వారిద్దరు ఏ సంస్కృతికి వారసులు? అని నిలదీశారు. వారి తండ్రులు, తాతలు ఎవరు మూలాలు ఎక్కడ? అని ప్రశ్నల వర్షం కురిపించారు. తప్పుగా మాట్లాడినవారికి చట్టం, సమాజం బుద్ధి చెప్పాలని విజయసాయి రెడ్డి హెచ్చరించారు. అలాంటివారికి యావజ్జీవం లేదా ఉరిశిక్ష వేసినా తప్పులేదని విజయసాయి రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. అభ్యంతర వ్యాఖ్యలతో దాడి చేయడం ఫ్యాషన్ అయిపోయిందని విమర్శించారు. మతం మారిన కొన్ని కులాల్లోని కుటుంబాలు.. హిందుత్వంపై విషం చిమ్ముతున్నాయని ధ్వజమెత్తారు. జోసెఫ్ రావణ్, సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌ను వైసీపీ సమర్థించడ మంటే.. దేశంపై చేస్తున్న దాడిగానే పరిగణించాలని అన్నారు. దేశద్రోహ కుట్రలపై ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని విజయసాయి రెడ్డి సూచించారు.

PRGI NO: TGTEL/25/A5314
అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక
ఎడిటర్ : లింగం రాజయ్య
బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్

# తెలంగాణను ప్రపంచ క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం: సిఎం రేవంత్ రెడ్డి

## సంపాదకీయం...

# పిఓకెలో హక్కుల హననం

నాలుగు గోడల మధ్య నిర్బంధించి హింసిస్తే పిల్లి కూడా తిరగబడుతుందనేది నికార్సయిన నిజం. పాకిస్తాన్ విషయంలో ఇప్పుడు జరుగుతున్నది అదే. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పిఓకె) లోని వనరులను దోచుకోవడమే తప్ప అక్కడి ప్రజల సంక్షేమాన్ని ఏనాడూ పట్టించుకున్న పాపానపోని పాక్ పాలకులు ఇప్పుడు అందుకు మూల్యం చెల్లించుకుంటున్నారు. గత మూడేళ్లుగా పిఓకెలో చోటు చేసుకుంటున్న అల్లర్లు చినికి చినికి గాలివానగా మారి, ప్రజా ఉద్యమంగా రూపు సంతరించుకుని, పాక్ ప్రభుత్వానికే ఎసరు పెట్టే స్థాయికి చేరుకున్నాయి. అసలే ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని కొన్నేళ్లుగా కాణీ అప్పు పుట్టక దాయాది దేశం అల్లాడుతోంది. దీనికితోడు బలోచిస్తాన్ లోనూ, ఆఫ్ఘన్ సరిహద్దుల్లోనూ ఉగ్రవాదం వేళ్లూనుకుని దేశాన్ని అతలాకుతలం చేస్తున్నాయి.

ఈ పరిస్థితుల్లో గోరుచుట్టుపై రోకటిపోటులా పిఓకెలో తలెత్తిన ప్రజా ఉద్యమంతో పాక్ ప్రభుత్వం దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. అణచివేతలతో ప్రజా ఉద్యమాలను ఆపలేమన్న వాస్తవాన్ని విస్మరించి సైన్యాన్ని ప్రయోగించి ఉద్యమకారులపై ఉక్కుపాదం మోపాలనుకోవడంతో పరిస్థితి పెనంమీద నుంచి పొయ్యిలోకి పడిన చందంగా మారింది. మొదటినుంచీ వివక్షాపూరిత వైఖరే. పిఓకెలోని జలవిద్యుత్ కేంద్రాల ద్వారా ఏటా 3500 మెగావాట్ల విద్యుదుత్పత్తి అవుతున్నా, ప్రజలనుంచి యూనిట్‌కు 30 రూపాయల పైగానే ముక్కుపిండి వసూలు చేస్తోంది. ఆహార సంక్షోభం పుణ్యమాని తినడానికి చాలినంత గోధుమపిండి కూడా లభించక పిఓకెలోని ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. ఇది చాలదన్నట్లు 53 సీట్ల పిఓకె లెజిస్లేటివ్ అసెంబ్లీలో 12 సీట్లను కశ్మీర్ శరణార్థులకు కేటాయించినా, ఆ స్థానాల్లో తమకు నచ్చినవారిని, తమ అడుగులకు మడుగులొత్తేవారిని నియమించడం ద్వారా పాక్ ప్రభుత్వం పిఓకెకు ప్రాతినిధ్యం లేకుండా చేస్తోంది. ఇలాంటి వివక్షలపై విసిగిపోయిన ప్రజానీకం మూడేళ్లుగా నిరసనలకు దిగుతుంటే, ఎక్కడికక్కడ అరెస్టులు చేస్తూ, ఎదురుతిరిగిన వారిని కాల్పుల్లో హతమారుస్తూ దమననీతికి పాల్పడుతోంది. పాక్ ప్రభుత్వ అరాచకాలను దునుమాడేందుకు మూడేళ్ల క్రితం విద్యార్థికులు, సామాజికవేత్తలు కలసి జమ్మూకశ్మీర్ అవామీ యాక్షన్ కమిటీ (జెఎఎసి)ని ఏర్పాటు చేసి, ఆందోళనలను ఉధృతం చేశారు. సామరస్య ధోరణితో సమస్యకు పరిష్కారం వెదకవలసిన ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ, పిఓకెకు నిత్యావసర వస్తువులు, ఔషధాల సరఫరాను నిలిపివేయడంతో ప్రజలు మరింత భగ్గుమన్నారు. స్వచ్ఛందంగా వీధుల్లోకి వచ్చి నిరసనలకు దిగుతున్నారు. ఈ నేపథ్యంలో 38 డిమాండ్లను ప్రభుత్వం ముందుంచి, వాటిని పరిష్కరించని పక్షంలో ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని జెఎఎసి హెచ్చరించడంతో పాక్ ప్రభుత్వానికి ఏం చేయాలో దిక్కుతోచడం లేదు. తీవ్ర నిర్బంధాలు, అణచివేతల మధ్య అణగారుతున్న పిఓకె ప్రజానీకం తమను ఆదుకుంటుందేమోననే ఆశతో భారత్‌వైపు చూడటం సహజమే. అయితే, దాయాది దేశాల మధ్య స్వేచ్ఛాయుత వాణిజ్యం ఏనాడో ముగిసిపోయిందన్న విషయాన్ని ఈ సందర్భంగా గమనించాలి.

## గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్, యంగ్ ఇండియా క్రీడా విశ్వవిద్యాలయం ఘనంగా ప్రారంభం




రంగారెడ్డి జిల్లా,జూలై 09,(సమాచార యోగి న్యూస్):

తెలంగాణను ప్రపంచ స్థాయి క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్, తెలంగాణ క్రీడా ప్రగతిలో నవ శకం కార్యక్రమాలతో పాటు యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఈ వేదికగా యంగ్ ఇండియా క్రీడా విశ్వవిద్యాలయం లోగో, అధికారిక వెబ్ సైట్, ఫిజికల్ లిటరసీ మిషన్, యంగ్ ఇండియా స్పోర్ట్స్ ఫెలోషిప్, అకడమిక్ కోర్సులను ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. దీనికి తోడు జాతీయ పారా అథ్లెట్ల ప్రతిభ గుర్తింపు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. రాష్ట్రంలో పారా అథ్లెట్ల ప్రతిభను వెలికితీసేందుకు ఆదిత్య మెహతా ఫౌండేషన్ సంస్థతో, అలాగే క్రీడల్లో యువజన భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు మై భారత్ సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం కీలక అవగాహన ఒప్పందాలను కుదుర్చుకుంది.రాష్ట్రం ఆతిథ్యం ఇవ్వనున్న పలు జాతీయ, అంతర్జాతీయ క్రీడా టోర్నమెంట్ల వివరాలను ప్రభుత్వం ఈ వేదిక మీదుగా అధికారికంగా ప్రకటించింది. రానున్న రోజుల్లో ఎనిమిదవ ఖేలో ఇండియా యూత్ గేమ్స్, నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్, హాకీ ఇండియా లీగ్, ప్రపంచ పికిల్ బాల్ లీగ్, ఆర్చరీ ప్రీమియర్ లీగ్, టెన్నిస్ ప్రీమియర్ లీగ్ లాంటి మెగా క్రీడా పోటీలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనున్నట్లు వెల్లడించింది. ఈ క్రీడా సంబరాలకు గుర్తుగా తెలంగాణ స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్ అనే వినూత్న కార్యక్రమాన్ని కూడా సర్కారు ప్రారంభించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, యువతే దేశ నిజమైన సంపద అని ఉద్ఘాటించారు. గత పాలకుల హయాంలో క్రీడలకు సంబంధించి సమగ్ర విధానం లేకపోవడం వల్లే మన దేశం ఒలింపిక్స్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పీటీ ఉష లాంటి కొద్దిమంది అంకితభావం గల క్రీడాకారులు మాత్రమే దేశానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారని గుర్తుచేశారు. క్రీడలకు అత్యధిక ప్రాధాన్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక క్రీడా విధానాన్ని రూపొందించిందని, అందులో భాగంగానే ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో ఈ యంగ్ ఇండియా క్రీడా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. క్రీడల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు, భారీ నగదు ప్రోత్సాహకాలు అందిస్తూ ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.లక్ష్యాలను చేరుకోవాలంటే వంద శాతం నిరంతర కృషి అవసరమని, రాబోయే రోజుల్లో తెలంగాణను ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చే స్థాయికి తీసుకెళ్లే దిశగా తమ ప్రభుత్వం పక్కా కార్యాచరణ చేపట్టిందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు పీటీ ఉష మాట్లాడుతూ, భారతదేశంలో బలమైన క్రీడా సంస్కృతిని నిర్మించే దిశగా తెలంగాణ ప్రభుత్వం యంగ్ ఇండియా క్రీడా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయ మన్నారు. అథ్లెట్ల విజయాలకు కోచ్‌లు, సరైన శిక్షణ, ఆధునిక క్రీడా విజ్ఞానం, సత్వర వైద్య సహాయం, సంస్థాగత మద్దతు చాలా కీలకమని ఆమె పేర్కొన్నారు.

అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక

## ఆట





# సబలెంకాకు షాకిచ్చిన ఒసాకా

### క్వార్టర్స్‌కు దూసుకెళ్లిన నయోమి ఒసాకా

వింబుల్డన్ 2026 టోర్నమెంట్‌లో పెను సంచలనం నమోదైంది. జపాన్ టెన్నిస్ స్టార్, మాజీ ప్రపంచ నంబర్ వన్ నయోమి ఒసాకా అద్భుత ప్రదర్శనతో అగ్రశ్రేణి క్రీడాకారిణి అరినా సబలెంకాకు షాకిచ్చింది. సెంటర్ కోర్టులో ఆదివారం జరిగిన నాలుగో రౌండ్ పోరులో ఒసాకా 6-2, 7-6(2) తేడాతో సబలెంకాను ఓడించి, తన కెరీర్‌లో తొలిసారి వింబుల్డన్ క్వార్టర్ ఫైనల్స్‌లోకి ప్రవేశించింది. గంటా 28 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో ఒసాకా సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. దూకుడైన బేస్‌లైన్ ఆటతో తొలి సెట్‌ను 6-2తో సులభంగా గెలుచుకుంది. రెండో సెట్‌లో సబలెంకా గట్టి పోటీ ఇచ్చినప్పటికీ, ఒత్తిడిని సమర్థవంతంగా అధిగమించిన ఒసాకా టైబ్రేక్‌లో విజయం సాధించి మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. కాగా, సబలెంకాపై ఎనిమిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఒసాకాకు ఇదే తొలి విజయం కావడం విశేషం. చివరిసారిగా 2018 యూఎస్ ఓపెన్‌లో ఆమెపై ఒసాకా గెలిచింది. ఈ ఓటమితో సబలెంకా జైత్రయాత్రకు బ్రేక్ పడింది. 2022 యూఎస్ ఓపెన్ నుంచి వరుసగా 14 గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో క్వార్టర్ ఫైనల్‌కు చేరిన ఆమె రికార్డుకు ఇక్కడ తెరపడింది. నాలుగుసార్లు మేజర్ ఛాంపియన్ అయిన ఒసాకా, ఈ విజయంతో తన పునరాగమనాన్ని ఘనంగా చాటుకుంది. ఈ ఏడాది జరిగిన నాలుగు గ్రాండ్‌స్లామ్‌లలోనూ ఆమె రెండో వారానికి (సెకండ్ వీక్) అర్హత సాధించింది. ఈ ఫలితంతో మహిళల సింగిల్స్ విభాగంలో ఈసారి కొత్త ఛాంపియన్ ఆవిర్భవించడం ఖాయమైంది.

# నార్వే చేతిలో బ్రెజిల్ ఘోర పరాజయం

న్యూయార్క్ న్యూజెర్సీలోని ప్రఖ్యాత మెట్‌లైఫ్ స్టేడియం ఒక చారిత్రక ఘట్టానికి, అదే సమయంలో ఫుట్‌బాల్ ప్రపంచంలోనే ఒక మహా విషాదానికి వేదికైంది. ప్రపంచ ఫుట్‌బాల్ చరిత్రలో ఐదుసార్లు వరల్డ్ ఛాంపియన్‌గా నిలిచి, ఎదురులేని శక్తిగా ఎదిగిన బ్రెజిల్ జట్టు, 2026 ఫిఫా వరల్డ్ కప్ రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లో అనూహ్యంగా నార్వే చేతిలో 2-1 తేడాతో ఊహించని పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ ఘోర ఓటమితో బ్రెజిల్ ఆరవసారి ప్రపంచ కప్ గెలవాలన్న దశాబ్దాల కలలు శాశ్వతంగా చెదిరిపోయాయి. మ్యాచ్ ముగిసిన వెంటనే మైదానంలో ఆటగాళ్లు కుప్పకూలిపోయారు. గ్యాలరీలో తమ జట్టుకు మద్దతుగా నిలిచిన వేల మంది బ్రెజిల్ అభిమానులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మ్యాచ్ ప్రారంభం నుంచే రెండు జట్ల మధ్య తీవ్ర ఆధిపత్య పోరు కనిపించింది. బ్రెజిల్ ఆటగాళ్లు తమదైన చురుకైన శైలిలో దాడులు ప్రారంభించారు. ఆట 13వ నిమిషంలో నార్వే డిఫెండర్ క్రిస్టోఫర్ అజెర్.. బ్రెజిల్ స్ట్రైకర్ మాథ్యూస్ కున్హాను పెనాల్టీ బాక్స్‌లో ఫౌల్ చేయడంతో, వీడియో అసిస్టెంట్ రిఫరీ సమీక్ష తర్వాత బ్రెజిల్‌కు పెనాల్టీ లభించింది. అయితే బ్రూనో గిమారేస్ కొట్టిన ఆ కీలకమైన పెనాల్టీ కిక్‌ను నార్వే సీనియర్ గోల్ కీపర్ ఓర్జన్ నైలాండ్ ఎడమవైపునకు డైవ్ చేసి అత్యద్భుతంగా అడ్డుకున్నాడు. బ్రెజిల్ పదేపదే చేసిన దాడులను నైలాండ్ ఒక ఇనుప గోడలా అడ్డుకుంటూ తొలి అర్ధభాగం ముగిసేసరికి స్కోరు 0-0 వద్ద నిలిచేలా చేశాడు. వినీసియస్ జూనియర్, గాబ్రియేల్ మార్టినెల్లి, రేయాన్ వంటి ప్రపంచ స్థాయి స్ట్రైకర్లు చేసిన అనేక గోల్ ప్రయత్నాలు నైలాండ్ అమోఘమైన ప్రతిభ ముందు విఫలమయ్యాయి. రెండవ అర్ధభాగంలో బ్రెజిల్ సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన యువ కెరటం ఎండ్రిక్, మైదానంలో అడుగుపెట్టిన 52 సెకన్లకే వినీసియస్ జూనియర్ ఇచ్చిన పాస్‌తో ఒక సువర్ణ అవకాశాన్ని చేజార్చుకున్నాడు. ఆ తర్వాత నార్వే స్టార్ స్ట్రైకర్ ఎర్లింగ్ హాలండ్ బ్రెజిల్ రక్షణ వలయాన్ని ఛేదించడం మొదలుపెట్టాడు. 79వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్ ఆండ్రియాస్ స్చెలెడెరుప్ అందించిన అద్భుతమైన క్రాస్‌ను హాలండ్ అత్యంత వేగంగా అద్భుతమైన హెడర్ ద్వారా గోల్‌గా మలిచాడు. దీంతో నార్వే 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. బ్రెజిల్ ఆటగాళ్లలో అప్పటికే తీవ్రమైన ఒత్తిడి పెరిగిపోయింది. ఆ ఒత్తిడిని, బ్రెజిల్ డిఫెన్స్ లోపాలను క్యాష్ చేసుకున్న హాలెండ్, 90వ నిమిషంలో బ్రెజిల్ డిఫెండర్ డానిలో కాళ్ల మధ్యలోంచి బంతిని పంపి, గోల్ కీపర్ అలిసన్‌ను ఏమార్చుతూ మరో అద్భుతమైన గోల్ సాధించి స్కోరును 2-0 చేశాడు.

# మెడ్చల్-మల్కాజిగిరి డీఎంహెచ్ఓగా డాక్టర్ కె. ఆనంద్ బాధ్యతల స్వీకరణ

మెడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ)గా డాక్టర్ కె. ఆనంద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.ఆర్.టి. నెం.293 ఉత్తర్వుల మేరకు ఆయనను ఈ పోస్టులో నియమించారు. ఇప్పటివరకు డీఎంహెచ్ఓగా విధులు నిర్వహించిన డాక్టర్ సి. ఉమా గౌరిని పరిపాలనా కారణాలతో రిలీవ్ చేస్తూ, హైదరాబాద్‌లోని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ సంచాలకుల కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రిలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓగా సేవలందిస్తున్న డాక్టర్ ఆనంద్‌కు మెడ్చల్ ఇన్‌ఛార్జి డీఎంహెచ్ఓగా తక్షణ బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డాక్టర్ ఆనంద్.. జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్ మను చౌదరి, అదనపు కలెక్టర్ (యూఎల్‌బీ) ఫైజాన్ అహ్మద్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం



నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా కృషి చేస్తానని తెలిపారు. జిల్లాలో అమలవుతున్న ప్రజారోగ్య కార్యక్రమాలు, జాతీయ ఆరోగ్య, సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని ఆయన స్పష్టం చేశారు. డాక్టర్ ఆనంద్‌కు మెడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో వైద్య పరిపాలనా రంగంలో సుదీర్ఘ అనుభవం ఉంది. గతంలో ఆయన మల్కాజిగిరి డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్ఓగా, మెడ్చల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) సూపరింటెండెంట్‌గా సేవలందించారు. అంతేకాకుండా జిల్లా మాతా శిశు సంక్షేమ కార్యక్రమాలకు, నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా అధికారిగా కూడా ఆయన విజయవంతంగా విధులు నిర్వర్తించారు. జిల్లాలోని క్షేత్రస్థాయి ఆరోగ్య వ్యవస్థపై ఆయనకున్న విస్తృత అవగాహన ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందేందుకు దోహదపడనుంది.

## మహిళా సాధికారతకు సురక్షిత పని ప్రదేశాలే పునాది: ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్ విజయా రాహత్కర్




మహిళల సాధికారతకు సురక్షితమైన, గౌరవప్రదమైన మరియు లింగ సున్నితత్వంతో కూడిన పని ప్రదేశాలే మూలాధారమని జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయా రాహత్కర్ ఉద్ఘాటించారు. కాన్పూర్‌లో జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక (పోష్) శిక్షణా కార్యక్రమంలో ఆమె ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 2013 పోష్ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో స్థానిక కమిటీలు, సంస్థల్లోని అంతర్గత కమిటీల పాత్ర అత్యంత కీలకమైనదని స్పష్టం చేశారు. ఈ ఉన్నతస్థాయి శిక్షణా కార్యక్రమంలో మహిళా సంక్షేమ శాఖ, పోలీసు శాఖలకు చెందిన సీనియర్ అధికారులతో పాటు ఘాటంపూర్ శాసనసభ్యురాలు సరోజ్ కురేల్, ఎస్‌హెచ్‌సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రయాణీకుడి సీట్ ఆక్రమించుకున్న టిటిఇ

### రైల్వేకు రూ. 60 వేల జరిమానా

రిజర్వేషన్ చేసుకున్న ఒక ప్రయాణీకుడి సీట్ను టిటిఇ అక్రమించు కున్న కేసులో దక్షిణ రైల్వేకు కేరళలోని ఒక వినియోగదారుల కమిషన్ రూ. 60 వేల జరిమానా విధించింది. 'సౌకర్యవంతమైన ప్రయాణం కోసం ప్రయాణీకుడు తన కష్టార్జితంతో బుక్ చేసుకున్న సీట్ను టిటిఇ అక్రమంగా ఆక్రమించుకుని, ఆ నిస్సహాయ ప్రయాణికుడిని వేరే సీటుకు వెళ్లేలా చేయడం స్పష్టంగా సేవలో లోపం, అన్యాయమైన వాణిజ్య విధానం కిందకే వస్తుంది' అని ఉత్తర్వుల్లో పేర్కొంది. టికెట్ ధరను తిరిగి చెల్లించాలని, అలాగే మానసిక వేదన, ఇబ్బందులకు పరిహారంగా ఫిర్యాదుదారుకు రూ.50 వేలు, ఖర్చుల కింద రూ. 10 వేలు చెల్లించాలని దక్షిణ రైల్వేను కమిషన్ ఆదేశించింది. ఉత్తర్వు కాపీ అందిన తేదీ నుండి 45 రోజుల్లోపు ఈ మొత్తాన్ని చెల్లించాలి, లేనిపక్షంలో, చెల్లింపు జరిగే తేదీ వరకు దీనిపై 6 శాతం వడ్డీ వర్తిస్తుందని కమిషన్ స్పష్టం చేసింది. ఈ మేరకు ఎర్నాకుళం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షులు డి.బి. బిను, సభ్యులు వి. రామచంద్రన్ వి, టిఎన్ శ్రీవిద్య ఆదేశాలు ఇచ్చారు. ఈ కేసు పూర్తి వివరాల ప్రకారం కేరళలో అలువా నుండి తిరువనంతపురానికి తన భార్యతో కలిసి ప్రయాణించడానికి రెండు రైలు టికెట్లను ఫిర్యాదుదారుడు బుక్ చేసుకున్నారు. అయితే అలువాలో రైలు ఎక్కేసమాయానికే ఫిర్యాదుదారులకు కేటాయించిన సీటులో టిటిఇ తన సూట్కేస్ ను ఉంచి గొలుసుతో లాక్ చేసి ఆక్రమించుకున్నారు. దీన్ని ప్రశ్నించగా, వేరే సీటులో సర్దుకుపోవాలని టిటిఇ చెప్పారని, అంతేకాకుండా తోటి ప్రయాణికుల సమక్షంలో తనను, తన భార్యను టిటిఇ వేధించారని కూడా ఫిర్యాదుదారు ఆరోపించారు. న్యాయం కోసం వినియోగదారుల కమిషనన్ను ఆశ్రయించారు.

## శరవేగంగా బీబీనగర్ ఏయిమ్స్ పనులు: మంత్రి జేపీ నడ్డాతో కలిసి పనుల సమీక్ష

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, రసాయనాలు మరియు ఎరువుల శాఖ మంత్రి జే.పీ. నడ్డాతో కలిసి తెలంగాణలోని ఏయిమ్స్ బీబీనగర్ భవన నిర్మాణ పనులు, కార్యకలాపాలను గురువారం ప్రజాప్రతినిధులు పరిశీలించి సమీక్షించారు. జాతీయ ప్రాముఖ్యత కలిగిన ఈ సంస్థ ఆరోగ్య సంరక్షణ, వైద్య విద్య, మరియు పరిశోధనల్లో అద్భుతమైన పురోగతిని సాధిస్తూ అత్యుత్తమ కేంద్రంగా ఎదుగుతుండటం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఏయిమ్స్ నిర్మాణ పనులు ఇప్పటికే 87 శాతానికి పైగా పూర్తయ్యాయని, ప్రస్తుతం ఆసుపత్రి, అకడమిక్, హాస్టల్ మరియు ఆయుష్ సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చాయని అధికారులు వివరించారు. వైద్య విద్య పరంగా ఎంబీబీఎస్, పీజీ, సూపర్-స్పెషాలిటీ, నర్సింగ్, అలైడ్ హెల్త్ కోర్సులలో 900 మందికి పైగా విద్యార్థులు ఇక్కడ




విద్యనభ్యసిస్తున్నారు. వీరికి 132 మంది ఫ్యాకల్టీ, 133 మంది సీనియర్ రెసిడెంట్ వైద్యులు నిరంతరం సేవలందిస్తున్నారు. రోగుల సంరక్షణలో భాగంగా, 250 పడకలు, అత్యాధునిక వ్యాధి నిర్ధారణ, అత్యవసర సేవలతో పాటు పీఎం-జేఏవై, ఆరోగ్యశ్రీ పథకాల కింద ప్రతిరోజూ దాదాపు 1,800 మందికి పైగా అవుట్ పేషెంట్లకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయి. డిజిటల్ హెల్త్‌కేర్ విభాగంలో తెలంగాణలోని అన్ని 33 జిల్లాల్లో 1.56 లక్షల మందికి పైగా రోగులకు ఈ-సంజీవని ద్వారా టెలికన్సల్టేషన్ సేవలు అందించారు. ఆసుపత్రికి వచ్చే 90 శాతం మంది రోగులను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో అనుసంధానం చేయడం గమనార్హం. పరిశోధనలు, సరికొత్త ఆవిష్కరణల్లోనూ ఏయిమ్స్ బీబీనగర్ ముందంజలో ఉంది. డీఆర్‌డీఓ సహకారంతో కృత్రిమ కాలు (ప్రోస్తెటిక్ లెగ్)ను అభివృద్ధి చేయడంతో పాటు, 129 పరిశోధన ప్రాజెక్టులను చేపట్టి రూ.64 కోట్ల గ్రాంట్లను సాధించింది. అలాగే 1,150 కి పైగా పరిశోధనలను ప్రచురించింది. సమాజ సేవలో భాగంగా 6 గ్రామాలను దత్తత తీసుకుని, 547 వైద్య శిబిరాల ద్వారా 66,000 మందికి పైగా ప్రజలకు వైద్య సేవలను చేరువ చేశారు. ప్రజారోగ్యంపై అవగాహన కల్పించేందుకుగాను కొత్తగా ఒక కమ్యూనిటీ రేడియో స్టేషన్‌ను కూడా ప్రారంభించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వం, కేంద్ర మంత్రి జే.పీ. నడ్డా మార్గదర్శకత్వంలో తెలంగాణతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన, సరసమైన వైద్య సేవలను అందించడంలో బీబీనగర్ ఏయిమ్స్ విప్లవాత్మక పాత్ర పోషిస్తోందని నేతలు ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పార్లమెంటు సభ్యులు కే.లక్ష్మణ్,అరుణ, చామల.కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగస్వాములు కండి

### స్టీల్, సిమెంట్ ధరలు తగ్గించాలని పరిశ్రమలకు మంత్రులు పొంగులేటి, శ్రీధర్ బాబు విజ్ఞప్తి

### సానుకూలంగా స్పందించిన యాజమాన్యాలు

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇళ్లు' పథకంలో భాగస్వాములు కావాలని, సామాజిక బాధ్యతతో స్టీల్, సిమెంట్ ధరలు తగ్గించి లబ్ధిదారులకు అండగా నిలవాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పరిశ్రమల యాజమాన్యాలకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రజా ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిందని వారు స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో స్టీల్, సిమెంట్ తదితర నిర్మాణ సామగ్రి ధరలు, సరఫరా, పరిశ్రమల సహకారం అనే అంశాలపై ఆయా పరిశ్రమల ప్రతినిధులతో మంత్రులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల పథకం కేవలం గృహ నిర్మాణం మాత్రమే కాదని, పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితం, సామాజిక భద్రతతో పాటు ఆత్మగౌరవాన్ని కల్పించే మహాయజ్ఞమని అభివర్ణించారు. హైదరాబాద్ మినహా రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని, ఇందులో ఇప్పటికే గణనీయంగా 85 శాతం ఇళ్ల శ్లాబులు పూర్తయ్యాయని వివరించారు. మిగిలిన 15 శాతం ఇళ్ల నిర్మాణాలు కూడా వివిధ దశల్లో శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. రెండో విడతలో ప్రతి నియోజకవర్గానికి రెండు వేల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా రెండున్నర లక్షల ఇళ్లు, అలాగే కోర్ సిటీ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుని కార్యాచరణ చేపట్టిందన్నారు. గిరిజన నియోజకవర్గాల్లో అదనంగా మరో వెయ్యి నుంచి 1500 ఇళ్లు మంజూరు చేస్తున్నామని, ఇళ్ల మంజూరు అనేది ఒక నిరంతర ప్రక్రియ అని, మూడు, నాలుగవ విడతల్లోనూ ఇళ్లను మంజూరు చేస్తామని మంత్రులు స్పష్టం చేశారు. దేశంలో మరెక్కడా లేని విధంగా నూరు శాతం సబ్సిడీతో రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తూ ఇళ్ల నిర్మాణం చేపట్టడం తెలంగాణ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని, ఈ విషయంలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని మంత్రులు గుర్తుచేశారు. ప్రభుత్వంపై ఎంతటి ఆర్థిక భారం పడినా రాజీ పడకుండా, ప్రతి లబ్ధిదారుడికి నిర్మాణ పురోగతికి అనుగుణంగా ప్రతి సోమవారం పారదర్శకంగా నిధులు విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రతి పేద కుటుంబం సొంత ఇంటిలో నివసించే వరకు ప్రభుత్వం తన బాధ్యతను పూర్తి నిబద్ధతతో నిర్వర్తిస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణను గుడిసెలు లేని రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రజలు కలిసికట్టుగా పనిచేయాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఒక ప్రజా ఉద్యమంగా మార్చాలని పిలుపునిచ్చారు. మంత్రుల విజ్ఞప్తికి పరిశ్రమల యాజమాన్యాలు సానుకూలంగా స్పందించాయి. ఇందిరమ్మ ఇళ్లకు అవసరమైన స్టీల్, సిమెంట్‌ను తక్కువ ధరకే అందించేందుకు సుముఖత వ్యక్తం చేశాయి. పేదలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయం చేస్తే ప్రభుత్వంతో పాటు పరిశ్రమల యాజమాన్యాలను కూడా ప్రజలు చిరస్థాయిగా గుర్తుపెట్టుకుంటారని



మంత్రులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. పరిశ్రమలు, హౌసింగ్ అధికారులు ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో సమన్వయం చేసుకొని, లబ్ధిదారులకు ఈ మెటీరియల్ ఎలా చేరవేయాలన్న దానిపై పకడ్బందీ రూట్ మ్యాప్ తయారు చేయాలని మంత్రులు సూచించారు. ఈ కీలక సమావేశంలో పరిశ్రమల ప్రతినిధులతో పాటు హౌసింగ్ సెక్రటరీ వి.పి.గౌతమ్, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణాదిత్య, టీజీఐఐసీ ఎండీ శశాంక తదితరులు పాల్గొన్నారు.

## మండలి చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సీఎస్ సంజయ్ జాజు

తెలంగాణ నూతన సీఎస్ సంజయ్ జాజు గురువారం తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ని, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ను వారి వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలి చైర్మన్‌కు, అసెంబ్లీ స్పీకర్‌కు సీఎస్ పుష్పగుచ్ఛం అందజేసి ,శాలువాతో సత్కరించారు. అనంతరం వారు సీఎస్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సెక్రెటరీ డాక్టర్ నరసింహా చార్యులు , వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య తదితరులు పాల్గొన్నారు.



## మెమొరీ కార్డుల్లో భీమ్‌రెడ్డి ఆస్తుల చిట్టా






ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టైన డీఎస్పీ సంకిరెడ్డి భీమ్‌రెడ్డికి చెందిన కర్ణాటకలోని బినామీ ఆస్తుల వివరాలు తేలాల్సి ఉన్నదని ఏసీబీ కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నది. సోదాల సమయంలో భీమ్‌రెడ్డి ఇంట్లో రెండు మెమొరీ కార్డ్స్ స్వాధీనం చేసుకున్నామని, అందులోని వివరాల ఆధారంగా డాక్యుమెంట్స్ స్వాధీనం చేసుకోవాల్సి ఉన్నదని తెలిపారు. భీమ్‌రెడ్డి దగ్గర ఒక డైరీ కూడా స్వాధీనం చేసుకున్నామని, అందులో 'మనకు ఇవ్వాల్సిన వాళ్లు' 'నేను ఇవ్వాల్సినవి' అంటూ రాసుకున్నట్టు చెప్పారు. సోదాల్లో పది బ్యాంకు ఖాతాలు, రెండు లాకర్లు గుర్తించామని, వాటిని పూర్తిస్థాయిలో తనిఖీ, స్వాధీనం చేసుకోవాల్సి ఉన్నదని అన్నారు.

**ఆస్తులపై విచారణ చేయాలి**

భీమ్‌రెడ్డికి చెందిన కొన్ని ఆస్తులను తన మొబైల్‌లో స్క్రీన్‌షాట్ తీసుకున్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. జహీరాబాద్‌లో హోమ్‌గార్డు లక్ష్మణ్ పేరున మూడెకరాలు, కర్ణాటకలో ఆరెకరాల వ్యవసాయ భూమి ఉన్నదని గుర్తించారు. కర్ణాటకలోనే మరో 30 ఎకరాలు, బెంగళూరు దేవనహల్లి వద్ద 11 ఎకరాలు, కామినేని హాస్పిటల్(ఎల్బీనగర్) వద్ద 200 గజాల ప్లాట్, పటాన్‌చెరు బిలియన్ హౌసింగ్ సొసైటీ వద్ద ఇంద్రకరణ్‌రెడ్డి పేరు మీద 400 గజాల ప్లాట్, పటాన్‌చెరులో నర్వ ఎంఎస్ఎన్ కంపెనీ పేరు మీద ఉన్న 2,000 గజాల స్థలం వంటి వాటిపై పూర్తిస్థాయిలో విచారణ చేయాల్సి ఉన్నదని కోర్టుకు చెప్పారు. దీంతో కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.

## విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసిన మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి..

### వార్తాపత్రికలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచన




విద్యార్థులు ప్రతిరోజూ తమ దినచర్యలో భాగంగా వార్తాపత్రికలు చదవడాన్ని ఒక అలవాటుగా మార్చుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సూచించారు. గురువారం అల్వాల్ మండలంలోని కౌకూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించిన ఆయన, అక్కడ విద్యార్థులతో కలిసి ఉదయం అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటిస్తూ.. వేదిక భయం (స్టేజ్ ఫియర్) లేకుండా తమకు వచ్చిన భాషలోనే ధైర్యంగా స్టేజ్ పైన మాట్లాడాలని, తద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని కలెక్టర్ ఉద్బోధించారు. అనంతరం పాఠశాలలోని సైన్స్ ల్యాబ్, లైబ్రరీ, తరగతి గదులను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, అందుబాటులో ఉన్న వసతులపై హెడ్ మాస్టర్ మురళీ కృష్ణమూర్తిని అడిగి తెలుసుకోగా, పాఠశాలకు అదనపు తరగతి గదులు అవసరమని ఆయన కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్.. టాయిలెట్లు, తరగతి గదులు వంటి అవసరమైన మౌలిక వసతులపై తగిన ప్రతిపాదనలు వెంటనే పంపాలని సూచించారు. అలాగే విద్యార్థులు కోరిన విధంగా క్రీడా సామగ్రిని అందిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) రేణుకా దేవి, అల్వాల్ ఎంఆర్ఓ రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

2026 సంవత్సరానికి గాను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపిక కోసం ఎంహెచ్ఆర్డీ అర్హులైన ఉపాధ్యాయుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఆసక్తి గల ఉపాధ్యాయులు పోర్టల్ ద్వారా తమ దరఖాస్తులను వ్యక్తిగతంగా ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉంటుంది. ఈ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు జూలై 13, 2026 ను చివరి తేదీగా నిర్ణయించినట్లు రంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూర్తి చేసిన అనంతరం, ఆ దరఖాస్తు ప్రింట్ కాపీకి అవసరమైన సంబంధిత ప్రతులను జతచేసి మొత్తం మూడు సెట్లను సిద్ధం చేయాలి. ఈ మూడు సెట్లను సంబంధిత పర్యవేక్షణాధికారి ద్వారా కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో జూలై 13వ తేదీ లోపు తప్పనిసరిగా సమర్పించాలని డీఈఓ స్పష్టం చేశారు. అర్హులైన ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సకాలంలో దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు సూచించారు.

## రాజ్యసభలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా వద్దిరాజు రవిచంద్ర

బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు తమ పార్లమెంటరీ పార్టీ నాయకత్వంలో కీలక మార్పులు చేపట్టారు. రాజ్యసభలో బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా, అలాగే పార్లమెంటరీ పార్టీ లీడర్‌గా ఎంపీ వద్దిరాజు రవిచంద్రను నియమిస్తూ ఆయన కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు ఈ బాధ్యతల్లో కొనసాగిన సీనియర్ నాయకుడు, రాజ్యసభ ఎంపీ కేఆర్ సురేశ్ రెడ్డి పదవీ కాలం ముగియడంతో, ఆయన స్థానంలో రవిచంద్రను ఎంపిక చేసినట్లు పార్టీ వెల్లడించింది. ఈ మేరకు రవిచంద్ర నియామకాన్ని ఖరారు చేస్తూ రాజ్యసభ సెక్రటరీ జనరల్‌కు బీఆర్ఎస్ ప్రెసిడెంట్ కేసీఆర్ అధికారికంగా లేఖ రాశారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని ఆ లేఖలో ఆయన స్పష్టం చేశారు.



# గొర్రె కాపర్ల సమస్యలపై యాదవ కార్పొరేషన్ చైర్మన్‌కు వినతి పత్రం



**హైదరాబాద్ ,అర్జున్ సమాచారం, జూలై 09:**

ఈరోజు హైదరాబాద్ కొండాపూర్ లోని నూతనంగా నియమించబడ్డ తెలంగాణ రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ మారబోయిన రఘునాథ్ యాదవ్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలతో సన్మానించిన తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్. ఈరోజు యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ గౌ. మారబోయిన రఘునాథ్ యాదవ్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు డా. కొమ్ము అశోక్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గొర్రె కాపర్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఫారెస్ట్ ప్రాంతాల్లో గొర్రెలు మేపుకోవడానికి అనుమతి లేకపోవడం,ఈ కారణంగా వేలాది కుటుంబాలు జీవనోపాధి కోల్పోతున్నాయి అని తెలిపారు.గొర్రెల మేత కోసం ఫారెస్ట్ ప్రాంతాల్లో గొర్రెలు మేపుకునే హక్కును కల్పిస్తూ నూతన జీవో విడుదల చేయాలని కోరారు. అలాగే గొర్రెల బీమా, సబ్సిడీ, మేత పథకాలు సక్రమంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు .వలస గొర్రె కాపరులకు పక్కకుడారాలు ,ఎల్ఈడి సోలార్ లైట్లు రవాణా సౌకర్యం కోసం బోలోరాలు ,డీసీఎం లు 75% సబ్సిడీతో ఇవ్వాలని , చదువుకున్న గొల్ల కురుమలకు పశుసంవర్ధక శాఖలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, మినీ ఫాలో డైరీల ద్వారా పాల ఉత్పత్తి అభివృద్ధి కోసం 80% సబ్సిడీతో గేదెల కోసం రుణాలు మంజూరు చేయాలని వినతి పత్రంల ద్వారా తెలిపారు దీనికి స్పందించిన చైర్మన్ మారబోయిన రఘునాథ్ యాదవ్ గొర్రె కాపర్ల సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, త్వరలోనే పరిష్కారానికి కృషి చేస్తాను. నూతన జీవో విషయంలో ఉన్నతాధికారులతో చర్చిస్తాను అని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు హరిబాబు యాదవ్, డాక్టర్ రాజేష్ చందు నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి



**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 9**

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు పెరిగేలా అధ్యాపకులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి జిల్లా ఇంటర్ విద్యాధికారిణి కల్పన సూచించారు. గురువారం మంథనిలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. కళాశాలల అభివృద్ధి కోసం లక్షల రూపాయలతో వివిధ పనులు చేపడుతున్నామని చెప్పారు. గత విద్యాసంవత్సరంతో పోలిస్తే ఈసారి మరింత ఎక్కువ మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందేలా కృషి చేయాలని అధ్యాపకులకు సూచించారు.అధ్యాపకులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ కళాశాలల్లో లభిస్తున్న సౌకర్యాలు, నాణ్యమైన విద్య, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని అన్నారు. విద్యార్థుల సంఖ్య పెరిగితేనే ప్రభుత్వ కళాశాలలు మరింత బలోపేతం అవుతాయని, విద్యార్థుల సంఖ్య తగ్గకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్క అధ్యాపకుడిపై ఉందని పేర్కొన్నారు.అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థుల నోట్‌బుక్స్‌ను పరిశీలించారు. కళాశాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు బాలోజీ, ఉషాతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

# మందల వెంకటేష్ సోదరుడి మృతికి నాయీబ్రాహ్మణ సంఘం నేతల నివాళి

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 9**

నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మందల వెంకటేష్ సోదరుడి మృతి సంఘానికి తీరని లోటని పలువురు నాయకులు పేర్కొన్నారు. అంత్యక్రియలకు హాజరైన నాయకులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జంపాల నర్సయ్య, జిల్లా అధ్యక్షుడు సూత్రం పరమేష్, కాంగ్రెస్ జిల్లా ఆర్‌టీఏ సభ్యుడు మంథిని సురేష్, నాయీబ్రాహ్మణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గొల్లపెల్లి రాజమల్లు, గోదావరిఖని పట్టణ నాయకులు పాల్గొని మృతుడికి నివాళులర్పించారు.



# మీసేవ కేంద్రాల ద్వారా యూరియా బుకింగ్!

## మంచిర్యాలలో మీసేవ విఎల్ఈ లకు ఈడీఎం గంప సునీల్ శిక్షణ

**మంచిర్యాల, జూలై 09: అర్జున్ సమాచారం**



రాష్ట్రంలోని రైతులకు సబ్సిడీ యూరియా అందుబాటును మరింత సులభతరం చేయడం కోసం ప్రభుత్వం వినూత్న నిర్ణయం తీసుకుంది. పారదర్శకతను పెంపొందిస్తూ, సకాలంలో యూరియా పంపిణీ చేయడం కోసం రాష్ట్ర వ్యవసాయశాఖ యూరియా బుకింగ్ సేవను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మీసేవ కేంద్రాల ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలో మంచిర్యాల జిల్లాలోని మీసేవ నిర్వాహకులకు జిల్లా ఎలక్ట్రానిక్ డెలివరీ మేనేజర్ (ఈడిఎం) గంప సునీల్ కుమార్ ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు ఈ సేవలను ఎలా పొందాలో మరియు బుకింగ్ ప్రక్రియలోని సాంకేతిక అంశాలపై ఆయన వీఎల్ఈలకు సమగ్రంగా అవగాహన కల్పించారు.ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నేతృత్వంలో పనిచేస్తున్న మీసేవ విభాగం, వ్యవసాయశాఖతో కలిసి సంయుక్తంగా ఈ కొత్త చొరవను ప్రారంభిస్తోందని ఆయన తెలిపారు. ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోలేని రైతులు తమ సమీపంలోని మీసేవ కేంద్రాన్ని సందర్శించి, ఆపరేటర్ సహాయంతో సులభంగా యూరియా బుకింగ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.రైతు తన పట్టాదారు పాస్‌బుక్ నంబర్‌తో సమీపంలోని మీసేవ కేంద్రాన్ని సందర్శించాలి.మీసేవ ఆపరేటర్ రైతు వివరాలను సేకరించి, సాగు విస్తీర్ణం మరియు పంట వివరాలను సిస్టమ్‌లో నమోదు చేస్తారు.రైతు ఎంపిక చేసిన ఎరువుల డీలర్ వద్ద అవసరమైన యూరియా పరిమాణాన్ని బుక్ చేస్తారు.రైతు నమోదిత మొబైల్ నంబర్‌కు పంపిన ఓటిపి ను ధృవీకరించిన తర్వాత వెంటనే బుకింగ్ ఐడీ జారీ చేయబడుతుంది.మీసేవ ద్వారా పొందిన బుకింగ్ ఐడీ.. బుకింగ్ చేసిన తేదీని మినహాయించి కేవలం 48 గంటల పాటు మాత్రమే చెల్లుబాటు అవుతుంది. రైతులు ఈ గడువు ముగిసేలోపు ఎంపిక చేసిన ఎరువుల డీలర్‌ను సంప్రదించి యూరియాను కొనుగోలు చేయాలి.సబ్సిడీ యూరియా బుకింగ్‌ను కేవలం అధికారిక ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ లేదా మీసేవ కేంద్రాల ద్వారానే చేయాలని వ్యవసాయశాఖ సూచిస్తోంది.ఓటీపీ అందుకోవడానికి రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్ యాక్టివ్‌లో ఉండేలా చూసుకోవాలి. కేవలం రూ. 10ల నామమాత్రపు సేవా రుసుముతో మీసేవ ద్వారా రైతులందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. ఈ సౌకర్యాన్ని జిల్లాలోని, రాష్ట్రంలోని రైతులందరూ వినియోగించుకొని, సబ్సిడీ యూరియాను అధికారిక బుకింగ్ విధానం ద్వారా సులభంగా పొందాలని వ్యవసాయశాఖ మరియు మీసేవ యంత్రాంగం విజ్ఞప్తి చేసింది.

# ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ వేగవంతం చేయాలి! జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్.

**అర్జున్ సమాచారం జులై 09 మంచిర్యాల ప్రతినిధి:**



జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ప్రజలకు అందించిన ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరాం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు లతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 24వ తేదీ వరకు చేపట్టనున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీలు భాగస్వాములు కావాలని, బూత్ స్థాయి అధికారులు ఓటర్లకు అందించిన ఎన్యుమరేషన్ ఫారాల సేకరణలో అధికారులకు సహకరించాలని తెలిపారు. ఓటరు ఎన్యువరేషన్ ఫారం నింపడంలో రాజకీయ పార్టీలచే నియమించబడిన బూత్ స్థాయి ఏజెంట్లు సహకరించాలని, నింపిన ఫారాలను సేకరించడంలో బూత్ స్థాయి అధికారులతో కలిసి పని చేయాలని తెలిపారు. నింపిన ఫారాలలోని వివరాలను బూత్ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు బి.ఎల్.ఓ. యాప్ లో నమోదు చేస్తారని తెలిపారు. అర్హత గల ఓటర్లు స్వయంగా ఆన్ లైన్ లో వివరాలు నమోదు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా బూత్ స్థాయి ఏజెంట్లు సహకరించాలని, తమ బూత్ స్థాయి ఏజెంట్లు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పరదా లేకుండా బొగ్గు రవాణా... రోడ్డుపై రాలుతున్న బొగ్గు ముక్కలు!

**అర్జున్ సమాచారం జులై 09 మంచిర్యాల ప్రతినిధి:**

మంచిర్యాల జాతీయ రహదారులపై బొగ్గు రవాణా చేసే భారీ లారీలు నిబంధనలను పట్టించుకోకుండా పరిమితికి మించి లోడ్‌తో ప్రయాణిస్తున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. లారీల్లో బొగ్గును ఎత్తుకు మించి లోడ్ చేసినప్పటికీ, పైభాగంలో తప్పనిసరిగా కప్పాల్సిన పరదా (తార్పాలిన్) వేయకుండా రవాణా చేస్తున్నట్లు కనిపిస్తోంది. దీంతో ప్రయాణించే సమయంలో బొగ్గు ముక్కలు, బొగ్గు ధూళి రోడ్డుపై పడుతూ వెనుక వచ్చే వాహనాలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బొగ్గు ముక్కలు వాహనాల అద్దాలను తాకే ప్రమాదం కూడా ఉందని వాహనదారులు చెబుతున్నారు. రవాణా నిబంధనల ప్రకారం లోడ్‌ను పరదాతో పూర్తిగా కప్పి తరలించాల్సి ఉన్నప్పటికీ, కొందరు నిర్వాహకులు వాటిని పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత రవాణా, గనుల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న లారీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# తాడిచర్ల-2 కేటాయింపు కిషన్ రెడ్డి కృషి ఫలితమే

### యూపిఎ హయాంలో కేటాయింపు అవాస్తవం

### భట్టి వ్యాఖ్యలపై మండిపడ్డ బిజెపి ఎమ్మెల్యే పాయల శంకర్

తాడిచర్ల-2 గని కేటాయింపు పూర్తిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కృషి ఫలితమేనని ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్అన్నారు.యూపీఏ-2 ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ తాడిచర్ల-2 బొగ్గు గనిని సింగరేణికి కేటాయించలేకపోయిందని విమర్శించారు. సింగరేణికి మీరేం చేశారని భట్టి విక్రమార్కను ప్రశ్నించారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ బిడ్డగా, సింగరేణి కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రధాని నరేంద్ర మోదీని ఒప్పించి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ గనిని సింగరేణికి కేటాయింపునకు కృషి చేశారని పేర్కొన్నారు. తాడిచర్ల గని కేటాయింపును సింగరేణి కార్మిక సంఘాలు స్వాగతిస్తూ ప్రధాని మోదీ, కిషన్ రెడ్డికి పాలాభిషేకాలు చేస్తున్నాయని తెలిపారు. కార్మికుల్లో వ్యక్తమవుతున్న ఆనందాన్ని, బీజేపీకి వస్తున్న ప్రజాదరణను కాంగ్రెస్ సహించకలేకపోతోందన్నారు. సింగరేణి ఆర్థిక పరిస్థితిపై కూడా పాయల శంకర్ తీవ్ర విమర్శలు చేశారు. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిపై రూ.32 వేల కోట్ల బకాయిలు మోపిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరో రూ.22 వేల కోట్ల బకాయిలు పెట్టిందని అన్నారు. మొత్తం రూ.55 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ పరిస్థితికి బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమని వ్యాఖ్యానించారు. సింగరేణి కార్మికులు ఈ రెండు పార్టీల నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయిలను ఎప్పుడు, ఎలా చెల్లిస్తుందో స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతామని తెలిపారు. సింగరేణిలో కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉందని, సంస్థ వ్యవహారాల్లో కేంద్రం మరింత చురుకుగా వ్యవహరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తన 51 శాతం వాటా పేరుతో సింగరేణి నిధులను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. బంగారు గనిలాంటి సింగరేణిని చీకట్లోకి నెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాసి కేంద్రం పూర్తి స్థాయిలో జోక్యం చేసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. అదే సమయంలో దేశంలోని ఇతర రాష్ట్రాల తో పోలిస్తే తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తోందని, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం అన్ని విధాలా సహకరిస్తోందని పాయల్ శంకర్ పేర్కొన్నారు.

PRGI NO: TGTEL/25/A5514
అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక


# సినిమా
CINEMA




# రూ.2.5 కోట్ల వాచ్‌తో షాకిచ్చిన జాన్వీ కపూర్..

మెహందీ వేడుకలో లగ్జరీ లుక్ వైరల్!

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ జాన్వీ కపూర్ మరోసారి తన ఫ్యాషన్ సెన్స్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. ఎలాంటి వేడుకకు హాజరైనా తన స్టైలిష్ లుక్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే జాన్వీ, తాజాగా తన సోదరి అన్షులా కపూర్ వివాహ వేడుకల్లో మెరిసిపోయింది. అయితే ఈసారి ఆమె డ్రెస్సింగ్ స్టైల్ కంటే చేతికి ధరించిన ఖరీదైన లగ్జరీ వాచ్‌నే సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. అన్షులా కపూర్ మెహందీ వేడుకలో జాన్వీ బ్లష్ పింక్ కలర్ వన్-షోల్డర్ గౌన్‌లో అందంగా కనిపించింది. సింపుల్‌గా కనిపించినా ఎంతో రాయల్ లుక్ ఇచ్చే ఈ డ్రెస్‌కు ఆమె ఎంచుకున్న యాక్సెసరీస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా ఆమె చేతికి కనిపించిన లగ్జరీ వాచ్ విలువ తెలిసి నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు.



# బాలయ్య సర్‌ప్రైజ్ విజిట్.. ఆనందంలో సాయి దుర్గా తేజ్ టీమ్

నందమూరి బాలకృష్ణ మరోసారి తన సరళమైన వ్యక్తిత్వాన్ని చాటుకున్నారు. ప్రస్తుతం తన ప్రతిష్టాత్మక చిత్రం చీదీఖ111 షూటింగ్‌లో బిజీగా ఉన్న బాలయ్య, అదే సమయంలో పక్కనే జరుగుతున్న సాయి దుర్గా తేజ్ సినిమా 'ఙ+ -- సంబరాల ఏటి గట్టు' షూటింగ్ సెట్‌ను సందర్శించి చిత్ర బృందాన్ని ఆనందంలో ముంచెత్తారు. ఆయన చేసిన ఈ సర్‌ప్రైజ్ విజిట్ ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో బాలకృష్ణ నటిస్తున్న చీదీఖ111 చిత్రీకరణ కొనసాగుతోంది. అదే ప్రాంగణంలోని మరో ఫ్లోర్‌లో దర్శకుడు రోహిత్ కేపీ తెరకెక్కిస్తున్న 'సంబరాల ఏటి గట్టు' సినిమా షూటింగ్ కూడా జరుగుతోంది. ఈ విషయం తెలుసుకున్న బాలయ్య, ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా నేరుగా అక్కడికి వెళ్లి చిత్ర బృందాన్ని కలిశారు.

# విజయ్ అభిమానులకు భారీ సర్‌ప్రైజ్..

జన నాయగన్ థియేటర్లలోకి ఎప్పుడు వస్తుందంటే!

కోలీవుడ్ స్టార్ హీరో, ప్రస్తుతం తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న విజయ్ నటించిన చివరి చిత్రంగా ప్రచారం పొందిన 'జన నాయకన్' సినిమాకి సంబంధించిన భారీ అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. ఎన్నో వాయిదాలు, అనేక అడ్డంకులు ఎదుర్కొన్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం విడుదల తేదీపై తాజాగా సినీ వర్గాల్లో ఆసక్తికర సమాచారం చక్కర్లు కొడుతోంది. దీంతో చాలా కాలంగా ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్న విజయ్ అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. గతంలో ఈ చిత్రాన్ని పలుమార్లు విడుదల చేయాలని ప్లాన్ చేసినప్పటికీ, వివిధ కారణాలతో రిలీజ్ వాయిదా పడుతూ వచ్చింది. ముఖ్యంగా విజయ్ రాజకీయాల్లోకి ప్రవేశించి, అనంతరం తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ సినిమాకు సంబంధించిన అధికారిక అప్‌డేట్స్ దాదాపు నిలిచిపోయాయి. దీంతో సినిమా విడుదలపై అభిమానుల్లో అనేక సందేహాలు నెలకొన్నాయి



# 'మైసా' టీజర్ ఆరోజే!

అగ్ర కథానాయిక రష్మిక మందన్న నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' చిత్రంపై నిర్మాణం నుంచే భారీ అంచనాలేర్పడ్డాయి. రవీంద్ర పుల్లె దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో గోండ్ తెగకు చెందిన గిరిజన అమ్మాయిగా శక్తివంతమైన పాత్రలో కనిపించనుంది రష్మిక మందన్న. పీడితుల పక్షాన పోరాటం చేసే ధీర వనితగా ఆమె పాత్ర అత్యంత శక్తివంతంగా సాగుతుందని చెబుతున్నారు. ఈ సినిమాలోని యాక్షన్ ఘట్టాల కోసం రష్మిక మందన్న బ్యాంకాక్‌లో ప్రత్యేక శిక్షణ కూడా తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ సినిమా టీజర్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నెల 15న టీజర్‌ను విడుదల చేయబోతున్నట్లు తెలిసింది. అక్టోబర్ 16న సినిమా రిలీజ్ ఉంటుందని సమాచారం. సెప్టెంబర్‌లో 'రణబాలి', అక్టోబర్‌లో 'మైసా' రిలీజ్‌లతో బాక్సాఫీస్ వద్ద రష్మిక మందన్న సందడి చేయడానికి సిద్ధమవుతున్నది




# వస్తున్నాం.. కొడుతున్నాం.. 'లెనిన్' విజయంపై నాగార్జున ధీమా

'ఈ కథలో ఉండే బాధని అఖిల్ తన జీవితంలోనూ ఎదుర్కొన్నాడు. నేను నిర్మాతను కాబట్టి ఈ సినిమా గురించి ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకున్నా. షూటింగ్ టైంలోనే ఫుటేజ్ చూపించారు. ఇదొక గొప్ప సినిమా అవుతుందని అప్పుడే అనుకున్నా' అన్నారు అగ్ర నటుడు అక్కినేని నాగార్జున. ఆయన తనయుడు అఖిల్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'లెనిన్' ఈ నెల 10న ప్రేక్షకుల ముందుకొస్తున్నది. మురళీకిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మించారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాగార్జున మాట్లాడుతూ పైవిధంగా స్పందించారు. 'నేను ఇంతగా ఇన్‌వాల్వ్ అయి చేసిన చివరి చిత్రం 'మనం'. అది నాన్న కోసం చేశాను. ఇప్పుడు నా కొడుకు కోసం 'లెనిన్' చేశాను. ప్రేమతో, ఇష్టంతో చేసిన ఈ చిత్రానికి ప్రేక్షకులు కూడా అదే ప్రేమను తిరిగి ఇస్తారని ఆశిస్తున్నా. ఈ సినిమాలో కొత్త అఖిల్‌ను చూడబోతున్నారు. భావోద్వేగాలు పండించడం మొదలుకొని డైలాగ్ డెలివరీ వరకు అఖిల్ కొత్తగా కనిపిస్తాడు. సినిమా చూసిన కాన్ఫిడెన్స్‌తో చెప్తున్నా. ఈ నెల 10న వస్తున్నాం.. కొడుతున్నాం.. మనోడు కొడుతున్నాడు'






# సింగరేణిలో క్రెడిట్ ఫైట్...

**మణుగూరు, జూలై 9, (అర్జున్ సమాచారం ప్రతినిధి )**

తెలంగాణ ప్రజల, సింగరేణి కార్మికుల చిరకాల వాంఛ నెరవేరింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని అత్యంత కీలకమైన తాడిచర్ల బొగ్గు బ్లాక్–2ను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కు కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎలాంటి వేలం లేకుండానే నేరుగా ఈ మైన్‌ను కేటాయించడం సింగరేణి చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది. అయితే, ఈ కేటాయింపు ప్రకటన వెలువడిన క్షణం నుంచే తెలంగాణ రాజకీయాల్లో 'క్రెడిట్ వార్' ముదిరింది. "ఇది మా వల్లే సాధ్యమైంది" అంటూ అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, కేటాయింపులు చేసిన బీజేపీ నేతలు పోటాపోటీగా క్లెయిమ్ చేసుకుంటున్నారు.గోదావరి లోయ బొగ్గు గనుల పరిధిలోని ములుగు కోల్ బెల్ట్ వాయువ్య ప్రాంతంలో తాడిచర్ల బ్లాక్–2 విస్తరించి ఉంది. దాదాపు 1,875 హెక్టార్ల పరిధిలో విస్తరించిన ఈ బ్లాక్‌లో భారీ బొగ్గు నిక్షేపాలు ఉన్నాయి. ఈ బ్లాక్‌లో దాదాపు 182 మిలియన్ టన్నుల నుంచి 434 మిలియన్ టన్నుల వరకు నాణ్యమైన బొగ్గు నిక్షేపాలు ఉన్నాయి. ఇందులో లభించే బొగ్గు అత్యంత నాణ్యమైన జీ–8, జీ–9 గ్రేడ్‌కు చెందినది. ఇది ఎన్టీపీసీ, కేటీపీపీ వంటి భారీ విద్యుత్ కేంద్రాలకు ఎంతో అనుకూలం. ఈ గని ద్వారా ఏటా 5 నుంచి 6 మిలియన్ టన్నుల బొగ్గును 40–50 ఏళ్ల పాటు ఉత్పత్తి చేయవచ్చు. దీని ద్వారా రూ.64,000 కోట్లకు పైగా ఆదాయం, సుమారు 1,200 నుండి 3,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుందని అంచనా. గతంలో తాడిచర్ల బ్లాక్–1ను టీజీ జెన్కోకు కేటాయించగా, బ్లాక్–2 కోసం కూడా జెన్కో ప్రయత్నించింది. కానీ, అంతిమంగా కేంద్రం దీన్ని సింగరేణికే దక్కేలా చేసింది.ఈ కేటాయింపు ఫైలుపై ప్రధాని నరేంద్ర మోడీ అనుమతితో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి సంతకం చేశారు. 2020 నుంచి ప్రభుత్వ రంగ సంస్థలకు వేలం లేకుండా నేరుగా గనులు కేటాయించే పద్ధతి నిలిచిపోయినప్పటికీ, సింగరేణి కోసం ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు బీజేపీ చెప్తోంది. వేలం పాట లేకపోవడం వల్ల సింగరేణికి సుమారు రూ.2,550 కోట్ల ఆక్షన్ ప్రీమియం మిగిలిందని, రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి రూ.16,000 కోట్లు వస్తాయని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తాము తెలంగాణ ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని, గతంలో ఏ ముఖ్యమంత్రి లేఖలు రాసినా సాధ్యం కానిది తాము చేసి చూపించామని బీజేపీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నాయి.మరోవైపు, రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత నిరంతరం జరిపిన పోరాటాలు, కేంద్రంతో జరిపిన సంప్రదింపుల వల్లే ఇది సాధ్యమైందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఢిల్లీ స్థాయిలో గట్టి ఒత్తిడి తెచ్చారని, వేలంలో కాకుండా నేరుగా కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి పంపిన ప్రతిపాదనల వల్లే కేంద్రం దిగివచ్చిందని కాంగ్రెస్ వాదిస్తోంది.ఇక ప్రధాన ప్రతిపాక్షం బీఆర్ఎస్ సైతం ఈ క్రెడిట్ రేసులో వెనక్కి తగ్గడం లేదు. గత పదేళ్ల కాలంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తాడిచర్ల బ్లాక్–2ను సింగరేణికి ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానాలు చేశామని, కేంద్రానికి వందలాది లేఖలు రాశామని గుర్తు చేస్తోంది. కార్మిక సంఘాల ద్వారా క్షేత్రస్థాయిలో తాము చేసిన ఆందోళనల ఫలితంగానే నేడు కేంద్రం ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదని బీఆర్ఎస్ వాదిస్తోంది. కాంగ్రెస్ కేవలం ఇప్పుడొచ్చి బిల్డప్ ఇస్తోందని గులాబీ శ్రేణులు విమర్శిస్తున్నాయి.పొలిటికల్ క్రెడిట్ వార్ ఎలా ఉన్నప్పటికీ, వేలం ప్రక్రియ లేకుండా తాడిచర్ల–2 దక్కడం సింగరేణి ఆర్థిక పురోగతికి ఊపిరి పోసినట్లయింది. అయితే ఈ బ్లాక్‌లో ఎక్కువ భాగం అటవీ భూమి కావడంతో.. మైనింగ్ ప్లాన్, ఎన్విరాన్‌మెంటల్, ఫారెస్ట్ క్లియరెన్స్‌లు సాధించి పూర్తిస్థాయిలో బొగ్గు ఉత్పత్తి ప్రారంభించడానికి కనీసం రెండేళ్ల సమయం పడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## బాలకార్మికులను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరం:

ఆపరేషన్ ముస్కాన్––శ×× కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఎ=ఖ కాలేజ్ వద్ద ఇటుక బట్టీ ని జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపీఎస్ గారు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ పనిచేస్తున్న కార్మికుల పరిస్థితిని పరిశీలించి, బాలలను పనిలో నియమించారా లేదా అనే అంశంపై ప్రత్యేకంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. బాలకార్మికులను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని



అన్నారు. ప్రతి చిన్నారికి విద్య, ఆరోగ్యం, సురక్షిత బాల్యం రాజ్యాంగం కల్పించిన హక్కులని, వాటిని హరించే హక్కు ఎవరికీ లేదన్నారు. ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకుని చిన్నారులను పనిలో పెట్టుకోకూడదని అన్నారు. 14 సంవత్సరాల లోపు పిల్లలను ఏ వాణిజ్య సంస్థలోనైనా, హోటళ్లు, టీ దుకాణాలు, గ్యారేజీలు, వర్క్‌షాప్‌లు, ఇటుక బట్టీలు, పరిశ్రమలు, గృహ సేవలు లేదా ఇతర ఉపాధి రంగాల్లో పనిలో పెట్టుకోవడం పూర్తిగా నిషేధించబడిందన్నారు ఆపరేషన్ ముస్కాన్––శ×× ద్వారా బాలకార్మికులు, వీధి బాలలు, తప్పిపోయిన చిన్నారులు, బలవంతపు శ్రమకు గురవుతున్న పిల్లలను గుర్తించి రక్షించడం, వారికి విద్య, వైద్యం, పునరావాసం కల్పించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, విద్యాశాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఎక్కడైనా బాలకార్మికులు పనిచేస్తున్నట్లు గమనించినా, బలవంతపు శ్రమకు గురవుతున్న చిన్నారుల గురించి సమాచారం తెలిసినా వెంటనే డయల్––100 లేదా చైల్డ్ హెల్ప్‌లైన్––1098 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## విధి నిర్వహణతో పాటు సేవాభావం చాటిన జైపూర్ పోలీసులు..

**గాయపడిన కోడెకు వైద్యం, యజమాని వచ్చి తీసుకెళ్లాలని విజ్ఞప్తి!**

**అర్జున్ సమాచారం జూలై 09 మంచిర్యాల ప్రతినిధి:**



ప్రజల భద్రతతో పాటు మూగజీవాల పట్ల కూడా తమ బాధ్యతను చాటుతూ జైపూర్ పోలీసులు మరోసారి సేవాభావాన్ని చాటుకున్నారు. జైపూర్ మండలంలోని ఇందారం ఎక్స్ రోడ్ సమీపంలో ఓ కోడె రోడ్డు పక్కనున్న కాలువలో పడిపోయి కాలుకు తీవ్ర గాయమై బాధపడుతుండగా, సమాచారం అందుకున్న జైపూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ కె. బాలయ్య సిబ్బందితో కలిసి వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నారు.గాయంతో విలవిలలాడుతున్న కోడెను పరిశీలించిన పోలీసులు ఆలస్యం చేయకుండా పశువైద్య అధికారిని పిలిపించి అక్కడికక్కడే చికిత్స అందించారు. అవసరమైన ఇంజెక్షన్లు వేయించి కోడెకు ఉపశమనం కల్పించారు. మూగజీవం ప్రాణాలను కాపాడేందుకు పోలీసులు చూపిన చొరవను స్థానికులు అభినందించారు.ఈ సందర్భంగా ఏఎస్ఐ కె. బాలయ్య మాట్లాడుతూ, ఈ కోడెకు యజమాని ఎవరైనా ఉంటే వెంటనే వచ్చి తమ పశువును తీసుకెళ్లాలని కోరారు. అలాగే రోడ్లపై ప్రమాదాలకు గురైన జంతువులు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందిస్తే తక్షణమే స్పందించి సహాయం అందిస్తామని తెలిపారు."ప్రజలకు మాత్రమే కాదు.. ఆపదలో ఉన్న మూగజీవాలకు కూడా అండగా నిలవడం పోలీసుల సామాజిక బాధ్యతలో భాగమే" అని జైపూర్ పోలీసులు తమ సేవాభావంతో మరోసారి నిరూపించారు.

# చిత్తూరు జిల్లాల్లో బంగారు గనులు

**తిరుపతి, జూలై 9, (అర్జున్ సమాచారం ప్రతినిధి )**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాయలసీమలో బంగారు గనుల అన్వేషణలో ఉంది. కర్నూలు జిల్లా జొన్నగిరి, చిత్తూరు జిల్లా కుప్పంలో బంగారు గనుల్ని గుర్తించగా.. శ్రీసత్యసాయి జిల్లా జౌకల, రామగిరి ప్రాంతంలో గనులు ఉన్నట్లు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో పరిశోధనలు చేసి త్వరలోనే స్పష్టతకు రానున్నారు. జౌకల ప్రాంతంలో మొత్తం ఆరు బ్లాకులు ఉన్నట్లు గుర్తించారు. మొత్తం నాలుగు దశల్లో బంగారం నిక్షేపాలపై రీసెర్చ్ చేసి నివేదికను సమర్పించనున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో బంగారం నిక్షేపాలు ఒక్కొక్కటిగా బయటుకొస్తున్నాయి. ఇటీవల కర్నూలుజిల్లా జొన్నగిరిలో బంగారం గనులు ప్రారంభంకాగా.. చిత్తూరు జిల్లా కుప్పంలోనూ బంగారు గనులున్నాయని గుర్తించారు. తాజాగా సత్యసాయి జిల్లాలో బంగారం నిక్షేపాలు ఉన్నాయని తేలింది. రాష్ట్ర ప్రభుత్వం సత్యసాయి జిల్లాలోని ఎన్పీకుంట మండలం జౌకల ప్రాంతంలో ఖనిజాన్వేషణ ప్రక్రియను వేగవంతం చేసింది. గతంలోనే ఇక్కడ భారీగా బంగారం నిక్షేపాలు ఉన్నాయని పరిశోధనల్లో తేలింది. ఈ ప్రాంతంలో బంగారం ఎంతమేరకు ఉందో స్పష్టత కోసం రీసెర్చ్ చేసేందుకు సిద్ధమయ్యారు. బంగారాన్ని అన్వేషించేందుకు ఆరు ప్రైవేట్ ఏజెన్సీలకు బాధ్యతలు అప్పగించారు. జౌకల ప్రాంతంలో మొత్తం ఆరు బ్లాకులు ఉండగా.. నాలుగు దశల్లో పరిశోధన చేయనున్నారు. ఈ పరిశోధనలు పూర్తయ్యాక నివేదికల్ని పరిశీలించి బంగారం నిక్షేపాలపై ఒక అవగాహనకు వచ్చాక మైనింగ్‌కు అనుమతిస్తారు.వాస్తవానికి 2015లోనే శ్రీ సత్యసాయి జిల్లా జౌకల ప్రాంతంలో ఉన్న ఆరు బ్లాకుల్లో బంగారం నిక్షేపాలపై మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ట్రస్ట్ పరిశోధనలు చేసింది. కర్ణాటకలోని కోలార్ గ్రీన్‌స్టోన్ బెల్ట్‌తో ఈ ప్రాంతం పోలి ఉందని.. నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించారు. 2022లో ఈ పరిశోధనలు జీ4 దశలో ఆగిపోవడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా ఏపీ ప్రభుత్వం ఆగిపోయిన జీ4 దశ నుంచి మళ్లీ బంగారం నిక్షేపాలపై పరిశోధనల్ని ప్రారంభించనుంది. ఈ ప్రాంతంలో పూర్తిస్థాయిలో పరిశోధనల తర్వాత స్పష్టత వస్తుందని చెబుతున్నారు. ఒకవేళ నిక్షేపాలు ఉంటే తవ్వకాలకు అనుమతి ఇస్తారు.ప్రస్తుతం బంగారం నిక్షేపాలు ఉన్నాయని చెబుతున్న జౌకల వెలిగల్లు గ్రీన్‌స్టోన్ బెల్ట్ కొత్తపల్లి బ్లాక్ ప్రాంతంలో ఉంది. ఈ ఏరియాలో ఆరు బ్లాకుల్లో 5,560 హెక్టార్లలో పూర్తిస్థాయి పరిశోధనలు చేయనున్ను. 2001లోనే ఇక్కడ ప్రాథమికంగా బంగారం నిక్షేపాల కోసం అన్వేషించగా.. ఓ సంస్థ ఖనిజాన్వేషణ చేసేందుకు లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకుంది.. కానీ ఆ తర్వాత అడుగులు ముందుకు పడలేదు. జౌకల ప్రాంతం మాత్రమే కాదు రామగిరి, రొద్దం ప్రాంతంలోనూ బంగారు నిక్షేపాలు ఉన్నాయని గుర్తించారు. ఇక్కడ గనుల్ని వేలం ద్వారా ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలని ఆలోచన చేస్తోంది ప్రభుత్వం.కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరిలో ఇటీవల బంగారు గనుల్లో ఉత్పత్తి ప్రారంభమైంది. జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ బంగారానని వెలికితీస్తోంది. తాజాగా చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో బంగారు గనులు ఉన్నట్లు గుర్తించారు. గుడుపల్లె మండలం చిగురుగుంట–బిసానత్తం బ్లాక్‌లో బంగారం ఉందని తేల్చారు. ఈ ప్రాంత కర్ణాటకలోని కేజీఎఫ్ ప్రాంతానికి 27 కిలోమీటర్ల దూరంలో ఉండటం విశేషం. ఈ ఏడాది ఈ బంగారు గనుల కోసం టెండర్ల పిలిచి అనంతరం రద్దు చేశారు. తాజాగా మరోసారి టెండర్లు పిలవాలని భావిస్తున్నారు. మొత్తానికి రాయలసీమలోని కర్నూలు, చిత్తూరు, శ్రీసత్యసాయి జిల్లాల్లో బంగారం బయటపడింది.

## బలహాన్‌పూర్‌కు బడి ఎప్పుడు?

**మూడుకిలోమీటర్లు నడిచి చదువుకు వెళ్లే చిన్నారులు**

**ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని సీపీఐ తాండూర్ మండల కార్యదర్శి కొండు బానేష్ విజ్ఞప్తి**

**అర్జున్ సమాచారం జూలై 09 మంచిర్యాల ప్రతినిధి:**



మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం రేచిని గ్రామపంచాయతీ పరిధిలోని బలహాన్‌పూర్ గ్రామానికి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మంజూరు చేయాలని సీపీఐ తాండూర్ మండల కార్యదర్శి కొండు బానేష్ కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బలహాన్‌పూర్ గ్రామంలో సుమారు 150 మంది జనాభా, 30 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని తెలిపారు. గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లేకపోవడంతో దాదాపు 20 మంది చిన్నారులు చదువు కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రోజూ మూడు కిలోమీటర్ల దూరంలోని రేచిని గ్రామానికి కాలినడకన వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నదని చెప్పారు. ఇంటి నుంచి బయలుదేరిన చిన్నారులు సురక్షితంగా తిరిగి వచ్చే వరకు తల్లిదండ్రులు ఆందోళనలోనే గడుపుతున్నారని పేర్కొన్నారు.కొంతమంది చిన్నారులు బంధువుల ఇళ్లలో ఉంటూ చదువును కొనసాగిస్తున్నారని, మరికొందరు గురుకుల పాఠశాలల్లో చేరి విద్యాభ్యాసం చేస్తున్నారని తెలిపారు. ఇంకొందరికి ఆ అవకాశం కూడా లేక ఇంటి వద్దనే ఉండిపోతూ తల్లిదండ్రులతో పాటు పొలాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీంతో బాల కార్మికుల సంఖ్య పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.గతంలో 2004 సంవత్సరం వరకు గ్రామంలో మర్రిచెట్టు కింద ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నడిచేదని గుర్తు చేశారు. పాఠశాల భవనం లేకపోవడంతో వర్షం పడిన రోజుల్లో తరగతులు నిలిచిపోయేవని, చివరకు పాఠశాలను పూర్తిగా తొలగించారని తెలిపారు. ప్రస్తుతం బలహాన్‌పూర్ గ్రామానికి ప్రభుత్వం ప్రాథమిక పాఠశాల మంజూరు చేస్తే భవనం కోసం అవసరమైన ఇంటిని గ్రామస్థులే ఉచితంగా అందించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి బలహాన్‌పూర్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని కొండు బానేష్ విజ్ఞప్తి చేశారు.

# భీమారం-5 అంగన్‌వాడీ కేంద్రంలో నాసిరకం గుడ్ల కలకలం!


**పురుగులు పట్టిన పప్పు, కుళ్లిన గుడ్ల సరఫరా**

**పర్యవేక్షణ కరువైందని అధికారులపై తల్లిదండ్రుల ఆగ్రహం**

**ఒకేచోట రెండు కేంద్రాలు.. దూరభారంతో పిల్లల అవస్థలు**

**భీమారం(మంచిర్యాల),అర్జున్ సమాచారం, జూలై 09:**

స్థానిక భీమారం–5 అంగన్‌వాడీ కేంద్రంలో తీవ్ర కలకలం రేగింది. పౌష్టికాహారం అందించాల్సిన కేంద్రంలోనే పిల్లలకు నాసిరకం, అనారోగ్యకరమైన ఆహారాన్ని సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు నిబంధనలను తుంగలో తొక్కి, పిల్లల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు.కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న ఆహారంలో నాణ్యత పూర్తిగా లోపించిందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పురుగులు పట్టిన పప్పుతో వంటలు చేయడం, కుళ్లిన కోడిగుడ్లను ఉడికించి చిన్నారులకు పెట్టడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.ఇలాంటి నాసిరకం, కుళ్లిన ఆహారం తిని పిల్లలకు ఏమైనా ఆరోగ్య సమస్యలు వస్తే దానికి ఎవరు బాధ్యత వహిస్తారు?" అని తల్లిదండ్రులు అధికారులను సూటిగా ప్రశ్నిస్తున్నారు.భీమారంలో ఉన్న రెండు అంగన్‌వాడీ కేంద్రాలు(5 ఒ2) వేర్వేరు ప్రాంతాలలో ఉండాల్సింది పోయి, ఒకే ప్రదేశంలో కొనసాగుతుండటంపై విమర్శలు వస్తున్నాయి. దీనివల్ల దూర ప్రాంతాల నుంచి వచ్చే చిన్నారులకు రాకపోకలు ఇబ్బందిగా మారాయి. కొన్ని కేంద్రాల్లో కేవలం ఆహారం మాత్రమే పెడుతూ, ప్రీ–ప్రైమరీ (పూర్వ ప్రాథమిక) విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. అందుకే, దూరం ఎక్కువగా ఉన్నప్పటికీ విద్యను బోధించే కేంద్రాలకే తమ పిల్లలను పంపించాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.భీమారంలోని అంగన్‌వాడీ కేంద్రాలపై సంబంధిత సూపర్‌వైజర్, సీడీపీఓ ల పర్యవేక్షణ అస్సలు లేకపోవడం వల్లే ఇలాంటి అనర్థాలు జరుగుతున్నాయని గ్రామ ప్రజలు స్పష్టం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.చిన్నారుల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న ఈ సున్నితమైన అంశంపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. నాసిరకం ఆహారాన్ని సరఫరా చేస్తున్న వారిపై మరియు పర్యవేక్షణ లోపించిన అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి





Printed, Published and Owned by LINGAM RAJAIAH, and Printed at Vijaya Lakshmi Printing Press , H.No.12-180, Gouthaminagar,Mancheria, Mancherial Telangana-504208, and Published at H.No.12-180, Gouthaminagar,Mancheria,Mancherial Telangana-504208. Editor: LINGAM RAJAIAH. PRGI. No. TGTEL/25/A5314, lingamrajaiahmncl@gmail.com,8121319896.